honeybee.org
Vol-11 Issue-3
వెల : రూ. 20/-

సంపుటి 11 సంచిక 3 మార్చి - ఏప్రిల్ 2023

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక







PALLE SRUJANA Telugu Bi-monthly March - April 2023 RNI No. TELTEL 2012/74620


# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30 /-లు మాత్రమే**


























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

లేదా

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

**సభ్యత్వ వివరాలు (2 సంవత్సరాలకు)**

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| సాధారణ పోస్టు ద్వారా | 400/- | 1,000/- |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 640/- | 1,240/- |

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యుఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.




7-8 April 2023,



"Grassroots





Civil20 – LiFE (Lifestyle for Environ
Working Group
LiFE is our responsibility.
"Grassroots
Innovations
and Lifestyle
LiFE (Lifestyle for Environment)
Working Group
assroots
novations
ANURAG NOOKALA

సంపుటి-11 సంచిక - 3 మార్చి - ఏప్రిల్ 2023

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.**
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* డ్రిప్ పైపులు చుట్టడం - పొలంలో వేయటం ఇక ఎంతో సులభం సృజనాత్మక రైతు 'సామినేని కృష్ణ' వినూత్న పరికరం - 3
* 'పల్లెసృజన' ఆధ్వర్యంలో హైదరాబాద్ లో "సి-20 లైఫ్" (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) వర్కింగ్ గ్రూపు సదస్సు - 6
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 14
* 'ఉపాధి హామీ పథకం' శ్రమతో పాటు జ్ఞానపరంగా, రైతుకు అండగా ఉండాలి - ప్రొ. అనిల్ కుమార్ గుప్తా - 18
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 21
* దివ్యాంగ కృషీవలుడు గేనాభాయ్ పటేల్ కు 'పద్మశ్రీ'తో జాతీయ సన్మానం - 24
* వరిలో కలుపుకు ప్రపంచంలో మొదటిసారిగా మూలికలతో తయారు చేసిన కలుపు నివారణ కషాయం - గల్లా చంద్రశేఖర్ మరో ఇన్నోవేషన్ - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 29
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీల్లో ...**
జి-20, సి-20 సదస్సు చిత్రాలు

**మధ్య పేజీలో :**
జనవరి-ఫిబ్రవరి 2023 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

## సంపాదకీయం

# 'ఉపాధి హామీ పథకం' సన్న, చిన్నకారు రైతులకు నష్టం చేస్తోందా?

'మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం' (నరేగా) ఎంతో ఆలోచించి, అన్ని వర్గాలతో సంప్రదించి దేశంలోని మేధావులు, సామాజిక వర్గాల ఆలోచనలను మేళవించి లోక్‌సభ, రాజ్యసభల్లో విస్తారంగా చర్చించి ఏకగ్రీవంగా చట్టబద్ధం చేయడం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సామాన్య ప్రజానీకానికి, మెజారిటీ జనాభాకు లాభపరిచే అతి కొన్ని చట్టాల్లో ఇది ఒకటి. ఈ చట్టాన్ని గ్రామాలకు ఉపయోగవంతంగా కావడానికి ఎన్నోమార్పులు, చేర్పులు ప్రభుత్వాలు చేస్తూ వచ్చాయి. క్రింది నుంచి పై వరకు అవినీతిని అరికట్టడానికి సాంకేతిక పద్ధతులను ఉపయోగించడం జరిగింది. ఈ పథకం క్రింద ఏ పనులు జరిగినా అవి గ్రామాలకు ఉపయోగంగా ఉండేలా ఇంకా ఎన్నో కట్టడిలను ప్రవేశ పెట్టారు. త్వరగా కూలీ ఇవ్వడానికి కూడా డి.బి.టి. (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) లాంటి పథకాలతో జోడించారు. పని ఏం జరిగిందో తెలియడానికి సాక్ష్యంగా ఫోటోలను రోజుకు రెండుసార్లు ఫోన్ ద్వారా పంపడానికి నిర్ణయాలు చేసారు. రెండు పేర్లతో ఒకే మనిషి లాభాలు పొందకుండా నరేగా కార్డును ఆధార్ కార్డుతో, బ్యాంకు అకౌంట్‌తో జోడించారు. ఇలా పథకాన్ని ప్రజా క్షేమం, గ్రామాభివృద్ధి లక్ష్యంగా గట్టి పరుస్తూ కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఈ సంవత్సరం బడ్జెట్‌లో 30 శాతం కంటే ఎక్కువ కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఇది శుభ సూచకం కాదు. దీనిపై చర్చ జరిపి కేటాయింపు తప్పక పెంచాలి.

నరేగాతో జరుగుతున్న పనుల గురించి గ్రామాల్లో చాలా విమర్శలు వింటున్నాం. ఎవరికీ పనికి రాని పనులు చేస్తున్నారని, అలా వెళ్ళి, ఇలా వస్తున్నారని, పనికి - కూలీకి లింకు లేదని, వంద రోజులు అందరికీ పని లభ్యం కావటం లేదని, ఫొటోలు పెట్టడం కుదరక వేతనం అందుబాటులో లేకుండా ఉందని ఇలా చాలా సమస్యలు అధికారులు, ప్రజలు, స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు. ఇవన్నీ చట్టం పథకం సాఫల్యం కావడానికి నిరోధంగా ఉన్నాయి. వీటన్నిటిని కూలంకషంగా చర్చించి, సమాధానాలు వెతికి వాటిని నిక్కచ్చిగా అమలు చేయాలి. ఈ పథకం దేశమంతా అమలులో ఉంది కాబట్టి ఫలితాలు ఎలా ఉన్నా దేశం మొత్తం వాటిని అనుభవించాల్సిందే. స్థానిక సమూహాలను, స్థానిక ప్రజా సంస్థలను ఎక్కువగా వాడుకుంటే ఫలితాలు బాగుంటాయని 'పల్లెసృజన' విశ్వాసం.

మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం గత 18 సంవత్సరాల్లో సామాన్య ప్రజల జీవితాలను ఎలా తీర్చి దిద్దింది, దేశ ఆర్థిక, సామాజిక స్థితిని ఎంత వరకు ప్రభావితం చేసిందన్న విషయాలను కూలంకషంగా పరిశీలించి, ఈ చట్టానికి తగు మార్పు, డిజిటల్ సాంకేతికత, చేయించే పనుల వల్ల గ్రామాలకు ప్రయోజనాలు, గ్రామీణ అభివృద్ధి పథకాల్లో తగ్గవలసిన పెట్టుబడి, రెండు పూటలా భోజనం అందరూ చేయాలన్న లక్ష్యం, ప్రజల ఆరోగ్యం, మానసిక పరిస్థితి... ఇవన్నీ అధ్యయనం చేయాలి. ఈ మహత్తర కార్యాన్ని గ్రామ ప్రజల శ్రేయస్సుకు, దేశాభివృద్ధికి యజ్ఞంలో సమిధలా ప్రభావవంతంగా అమలు చేయాలి.

అయితే ఈ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి సన్న, చిన్నకారు రైతులకు ఇబ్బంది ప్రారంభమైంది. దీనికి మునుపు నాటుకు, కలుపుకు, కోతకు కూలీల కొరత ఉండేది కాదు. ఊళ్ళోనే దొరికేవారు. ఈ నరేగా పనులు అమలు కావడంతో తక్కువ సమయంలో, తక్కువ పనితో, ఎక్కువ కూలీ లభించడంతో సన్న, చిన్నకారు రైతులకు గ్రామాల్లోని కూలీలు అందుబాటులో లేకుండా అయ్యారు. భార్యాభర్తలు చిన్న రైతు కుటుంబాలు తమ చిన్న పొలంలో సమయానికి అన్ని పనులు చేయలేక నష్టపోతున్నారు. ఎవరైనా కూలీగా వచ్చినా, నరేగా కూలీ కంటే ఎక్కువ ఇవ్వాలని రైతుపై వత్తిడి తేవడం మరియు పని చేసే సమయం రాను రాను తగ్గుతూ రావటం ప్రారంభమైంది. వీరి కష్టాలు పెరగడం తప్ప తగ్గటం జరగలేదు. దేశమంతా ఈ చట్టం వల్ల కలిగే నష్టాన్ని సన్న చిన్నకారు రైతులకు కలగకుండా ఎన్నో సలహాలిచ్చారు. కాని వీటిని ప్రభుత్వం అమలు పరచలేదు. కారణాలేమైనా అధిక రైతులు ఈ నష్టంతో జీవితాన్ని గడుపుతున్నారు.

నరేగా పనుల్లో సన్న, చిన్నకారు రైతు పొలాల్లో పని చేయడం ఒక కార్యక్రమంగా నమోదు చేయడం ఒక ప్రధాన పరిష్కారం. ఇవ్వాల్సిన కూలీని కొంత రైతు, మిగతాది కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలి. స్థానిక పంచాయితీ సంస్థలు ఏ రైతు పొలంలో ఎంత మంది కూలీలు పని చేయాలో నిర్ణయించాలి. అందరికీ ఈ కూలీలు అందుబాటులో ఉండేలాగా ఎవరికీ కూలీల కొరత వల్ల నష్టం జరగకుండా సమతుల్యంగా కూలీలను పంచాలి. రైతులకు లాభమైతే ఊరికి, దేశానికి లాభమే కదా! నరేగా ఉద్దేశ్యం కూడా తీరుతుంది. నరేగా చట్టంలో ఈ మార్పులు తీసుకు రావడానికి, ఇందులో ఉన్న లోపాలను గ్రహించి, వాటికి పరిష్కారాలు వెతికి, సమగ్ర చట్టాన్ని తయారు చేయాలి. 'పల్లెసృజన' దృష్టిలో ఇది సాధ్యం. మీ ఆలోచనలు, విమర్శలు, సలహాలు ఆహ్వానిస్తున్నాం.

భారత ప్రభుత్వం జి-20 అధ్యక్షత వహించడం, దేశమంతా ఈ జి-20 కార్యక్రమాల్లో ఉత్సాహంతో అన్ని వర్గాలు పాల్గొనడం ఎంతో ఆనందకరంగా ఉంది. ఈ సందర్భంలో జి-20 లో సి-20 (సివిల్ సొసైటీ 20) 'పల్లెసృజన'కు "గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు - జీవన విధానంలో వాటి ప్రభావం" అన్న విషయంపై దేశమంతా చర్చలు జరపాలన్న బాధ్యతను అప్పగించింది. ఇది పల్లెసృజన కుటుంబానికి ఒక గొప్ప గుర్తింపు. ఏప్రిల్ 7-8 తేదీలలో ఈ సందర్భంగా ప్రథమ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. దీనికి జాతీయ, అంతర్జాతీయ వక్తలు, విశేషజ్ఞులు 20 వేల మంది విబిటి విద్యార్థులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. వాలంటీర్ల స్వచ్ఛంద సేవల ప్రభావం పల్లెసృజనకు దేశమంతా మెప్పు లభించింది. వారి అసమాన సేవా నిరతికి పల్లెసృజన సదా కృతజ్ఞతలతో అభినందిస్తోంది.

చాలామంది రైతులు, ఇన్నోవేటర్లు, మూలికా వైద్యులు - సోషల్ మీడియా ద్వారా తమ ఆలోచనలను మంచి పద్ధతులను ప్రజలకు తెలుగులో వివరించడం, వాటిని లక్షల మంది చూడటం ఎంతో ఆనందంగా ఉంది. సాంకేతిక జ్ఞానం ఇలా సద్వినియోగం చేయడం వల్ల సమానాంతర జ్ఞాన ప్రసరణ స్వల్ప సమయంలో జరిగి అధిక గ్రామ ప్రజలు సృజనాత్మక పద్ధతులను, యంత్రాలను వాటి పెట్టుబడులు తగ్గించుకోవడం ఎక్కువ లాభాలు పొందటం జరుగుతుందని పల్లెసృజన నమ్ముతున్నది.

ఈ వేసవి తీవ్రంగా ఉంది. అందరూ తమను తాము కాపాడుకుంటూ అన్ని పనులు జాగ్రత్తగా చేసుకోవాలని మనసారా కోరుతున్నాం.




భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# డ్రిప్ పైపులు చుట్టడం - పొలంలో వేయటం ఇక ఎంతో సులభం

# సృజనాత్మక రైతు 'సామినేని కృష్ణ' వినూత్న పరికరం



- వీరరాఘవ రెడ్డి

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా భూగర్భ జలాలు రోజు రోజుకూ అడుగంటి పోతున్న పరిస్థితుల్లో పొలాలకు కాలువల ద్వారా నీరు పారించటం వల్ల చాలా నీరు వృధా అవుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా కనుగొన్నదే 'బిందు సేద్యం'. పంట మొక్కల వద్ద చుక్క చుక్క నీరు అందేలా 'డ్రిప్ పద్ధతి', వర్షపు చినుకుల్లా పంటపై పడేలా 'స్ప్రింక్లర్' పద్ధతి ద్వారా దేశంలో ఎంతో నీటిని ఆదా చేయగలుగుతున్నాము. ఈ పద్ధతి కొన్నిరోజులు బాగానే అనిపించినా, రైతు ఈ పద్ధతులను పాటించటం మొదలు పెట్టిన తర్వాత కొన్ని కష్టాలు ఎదురయ్యాయి.

డ్రిప్ పద్ధతిలో పంటకు నీరు అందించాలి అంటే పొలంలో పంట వరుసల వెంట 'ల్యాటరల్' పైపును పొడవుగా వేసి, దానికి పంట మొక్కల వద్ద చుక్క చుక్కగా నీరు పారేలా 'డ్రిప్పర్లు' ఏర్పాటు చేస్తారు. పంట కాలం పూర్తయిన తర్వాత ఆ ల్యాటరల్ పైపులను తిరిగి చుట్టలుగా చుట్టుకొని, పొలం సేద్యం చేసుకుని, మళ్ళీ పంట వేసిన తర్వాత మరలా ఈ పైపులను పొలంలో పరుచుకోవాలి. రైతుకు ఈ బిందు సేద్య పద్ధతిలో ఈ పని చాలా శ్రమతో కూడుకున్నది. డ్రిప్ పైపులను చుట్టలుగా చుట్టాలి అంటే కనీసం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు ఎంతో శ్రమకోర్చి వాటిని చుట్టలుగా చుట్టాల్సి ఉంటుంది. చుట్టలుగా చుట్టే టపుడు అవి పురి తిరిగిపోయి చిక్కులు పడతాయి. మళ్ళీ వాటిని తిప్పి పైపును చుట్టుకుంటూ వెళ్ళాలంటే చేతులు విపరీతమైన నొప్పికి గురవుతాయి. పైగా పొలంలో పరిచిన పైపులు 3 నుండి 4 వందల అడుగుల దాకా ఉంటాయి. ఒక వ్యక్తి వాటిని లాగుతూ ఉంటే, మరో వ్యక్తి ఆ పైపు పురి పడకుండా చూసుకుంటూ వుంటే మరో వ్యక్తి చుట్టలుగా చుట్టాలి.

> పెద్ద కమతాలున్న రైతులకు ఇదెంతో శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని. ఈ సమస్యను గమనించిన ఖమ్మం జిల్లాకు చెందిన **53** సంవత్సరాల రైతు 'సామినేని కృష్ణ' ఒక సులువైన పరికరాన్ని తయారు చేసి ఎంతో మంది రైతుల శ్రమకు చరమగీతం పాడాడు. కృష్ణ చేసిన ఈ పరికరం వల్ల ఇప్పుడు పైపులు చుట్టడం, పొలలో పరుచుకోవడం ఎంతో సులభం, ఎంతో సమయం ఆదా.

ఇదంతా చిన్న చిన్న కమతాలు వున్న రైతు అయితే కొంత వరకు కష్టపడి చేసుకో గలడు. కానీ పెద్ద పెద్ద కమతాలున్న రైతులకు ఇదెంతో శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని. ఈ సమస్యను గమనించిన ఖమ్మం జిల్లాకు చెందిన 53 సంవత్సరాల రైతు 'సామినేని కృష్ణ' ఒక సులువైన పరికరాన్ని తయారు చేసి ఎంతో మంది రైతుల శ్రమకు చరమగీతం పాడాడు. కృష్ణ చేసిన ఈ పరికరం వల్ల ఇప్పుడు పైపులు చుట్టడం, పొలంలో వాటిని పరుచుకోవడం ఎంతో సులభం, ఎంతో సమయం ఆదా. పైగా రైతుకు ఖర్చును తగ్గించటంతో పాటు, పైపు కూడా కొద్దిగా ఎక్కువ కాలం పని చేసేలా ఉంది కృష్ణ చేసిన ఉపాయం.

'సామినేని కృష్ణ' గారి స్వగ్రామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిల్లూరు పాడు మండలం లోని 'కొత్తూరు' అనే గ్రామం. కానీ ప్రస్తుతం ఆయన ఖమ్మం పట్టణంలో నివాసముంటున్నాడు. తనకున్న కొద్ది పొలానికి తోడుగా మరి కొంతమంది రైతుల పొలాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ ఉంటాడు. కృష్ణ 10 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని అందులో డ్రిప్పు పద్ధతిలో పంటలకు నీరు పారిస్తూ ఉండేవాడు. ప్రతి సంవత్సరం ఈ డ్రిప్పు పైపులను చుట్టుకోవాలంటే చాలా శ్రమ పడేవాడు.

పంట అయిపోయిన వెంటనే వాటిని చుట్టేటపుడు అవి మెళికలు పడటం, వాటిని విప్పదీసుకుని చుట్టుకోవడం చాలా శ్రమ అనిపించింది. ఎక్కువ పొలం కాబట్టి వాటిని చుట్టడానికి పొలమంతా తిరగాలంటే బాగా కాళ్ళ నొప్పులు వచ్చేవి. అందువల్ల వాటిని చుట్టేందుకు కూలీలు కూడా సరిగా వచ్చేవారు కాదు.

మొదట ఈ పైపులను చుట్టుకోవడం కొద్దిగా కష్టంగా ఉందని 16 ఇనుప కడ్డీలతో ఒక వృత్తాకార చక్రాన్ని తయారు చేసి, దానికి పైపును చుట్టుకోవడం వల్ల కొద్దిగా సమస్య తీరినట్లు అయింది. కానీ, అలా చుట్టిన పైపు చుట్టను బయటకు తీయాలంటే మళ్ళీ ఇద్దరు ముగ్గురు వ్యక్తులు దాన్ని బయటకు లాగటానికి పైపును గుంజి, గుంజి కొద్ది కొద్దిగా బైటకు వచ్చే చేయటం ఇలా ఎంతో కష్టపడాల్సి వచ్చేది. బాగా చేతులు నొప్పి పుట్టేవి.

అప్పుడు ఇంత కష్టాన్ని తగ్గించటం ఎలా? పైపు చుట్టిన తర్వాత దాన్ని బైటకు తీయటానికి ఇంత కష్ట పడకుండా పైపు చుట్ట సులువుగా బయటకు వచ్చే మార్గం ఆలోచించాడు కృష్ణ. తన మదిలో వచ్చిన ఆలోచనతో ఒక వెల్డింగ్ షాపు వద్దకు వెళ్ళి అందుకు కావలసిన ఇనుప పైపులు, కడ్డీలను తీసుకుని తన ఆలోచనను వెల్డింగ్ చేసే వ్యక్తికి వివరిస్తూ ఒక నమూనా పరికరాన్ని తయారు చేశాడు. దాన్ని తన పొలంలోకి తీసుకు వెళ్ళి పైపును చుట్టి చూశాడు. గతంలో పైపు చుట్టడానికి పడిన కష్టంలో 50 శాతం వరకు శ్రమ, సమయం తగ్గింది. పైపు చుట్టను బయటకు తీయటంలో పడే శ్రమ నూటికి నూరుపాళ్ళు తగ్గిపోయింది. ఒకటి రెండు ఎకరాలు కాదు పది ఎకరాల పొలంలో డ్రిప్పు పైపులను చుట్టడం, పొలం తయారు అయిన తర్వాత, పంట నాటి, మళ్ళీ వాటిని పొలంలో పరచటంలో చాలా వరకు శ్రమ తగ్గటం ఎంతో ఆనందంగా అనిపించింది.

ఈ పరికరంతో ఒక వ్యక్తి పైపు చివర నివబడి దాన్ని చుట్టేటపుడు ఎటువంటి మెళిక పడకుండా చూసుకుంటూ ఉంటే, రెండో వ్యక్తి పరికరానికి ఏర్పాటు చేసిన పిడిని చేతితో తిప్పుడూ పైపును చుట్టడం జరుగుతుంది. పైపు చుట్టటం అయిపోయిన తర్వాత చుట్టిన చక్రానికి ఏర్పాటు చేసిన కడ్డీలను చేతితో సున్నితంగా లోపలికి నెట్టినట్లైతే పైపు చుట్ట సులభంగా బయటకు వచ్చేస్తుంది. ఆ పైపు చుట్టను తీసుకువెళ్ళి మరో వ్యక్తి వాటన్నిటికి ఒకచోట జాగ్రత్తగా సర్దిపెడతాడు. ఈ పనంతా కేవలం కొన్ని నిమిషాల్లో జరిగిపోతుంది.

ఈ పైపులు చుట్టడానికి గతంలో ముగ్గురు మగ మనుషులను రోజుకు 500 రూపాయల కూలీ ఇచ్చి పని చేయిస్తే, కేవలం ఒకటిన్నర ఎకరాల్లోని పైపులను మాత్రమే చుట్టేవారు. పైగా ఈ కష్టాన్ని పడలేక కూలీలు సరిగ్గా వచ్చేవారు కాదు. ఇప్పుడు అదే ముగ్గురు వ్యక్తులు ఎటువంటి శ్రమ లేకుండా పదెకరాల పైపులను కేవలం అర పూట సమయంలోనే పూర్తి చేస్తున్నారు. అదీ కష్టపడకుండా ఆడుతూ పాడుతూ



ఒక ఆటలాగా పని పూర్తి చేస్తున్నారు. ఈ పరికరం తయారు చేయటం వల్ల రైతుకు ఎంత సమయం, కష్టం ఆదా అయిందో చూడండి. గతంలో మనుషులు పైపును చుట్టేటపుడు పైపు మెళిక బాగా పడేది. ఇప్పుడు సమస్య కూడా లేదు. ఈ పని చేస్తున్నపుడు చూడటానికి కూడా ఎంతో అందంగా ఉంటుందని ఇన్నోవేటర్ సామినేని కృష్ణ అంటాడు. పైపు చుట్టిన తర్వాత ఆ పైపు చుట్టను బయటకు తీయటం నిమిషాల్లో పని. గతంలో పడ్డ కష్టం పూర్తిగా లేకుండా పోయినందుకు కూలీలు కూడా ఎంతో ఆనందించారట.

మళ్ళీ పంట వేసిన తర్వాత పైపును ఇదే పరికరాన్ని ఉపయోగించి పొలంలో పరుచుకోవటం కూడా ఎంతో సులభం. కాకపోతే పైపును పొలంపైన లాక్కుంటూ వెళ్తే ఈ పరికరానికి తగిలించిన చుట్ట చక్రం వేగంగా తిరగటం వల్ల పైపు చిక్కుపడే ప్రమాదం ఉంది. కాబట్టి ఒక వ్యక్తి పరికరం దగ్గర వుండి, నెమ్మదిగా, పైపును పొలంలో పరిచే వ్యక్తికి అనుగుణంగా చక్రానికున్న పిడిని వెనక్కి వదులుతూ అవసరమైనంత పైపును విడుదల చేయాల్సి ఉంటుంది. అయినా ఇదేమీ పెద్ద కష్టం కాదు, గతంతో పోలిస్తే ఎంతో సులభం కూడా.

ఈ పరికరాన్ని ఉపయోగించుకుని డ్రిప్పు పైపును చుట్టడం వల్ల పైపు నాణ్యత ఎక్కడా దెబ్బ తినకుండా పైపు ఎక్కువ కాలం మన్నన చెందుతుంది. పని కూడా వేగంగా, నాణ్యంగా జరుగుతుంది. ఎటువంటి శ్రమ, మెళిక పడటం లాంటివి ఉండవు. కృష్ణ తన పైపును



5-6 సంవత్సరాలుగా వాడుతునే ఉన్నాడట. పైపులలో ఫ్లోరైడ్ పేరుకు పోయి, డ్రిప్పర్లు మూసుకు పోవటం, పైపులు కూడా మూసుకు పోవటం జరుగు తుంది. దీని నివారణకు కృష్ణ పొలంలో పైపును పరిచిన తర్వాత రెండు చివరల ఆ పైపుకు రెండున్నర లేదా మూడు అంగుళాల పైపు ముక్కను అతికించి, అందులో 25 లీటర్ల నీటిలో కలిపిన 'ఫ్లోరిక్ ఆసిడ్'ను పోసి, కొద్ది సేపు అలాగే ఉండనిచ్చి, ఆ నీటిని క్రిందకు వదలటం ద్వారా అందులో పేరుకు పోయిన ఫ్లోరైడ్ పెక్కులన్నీ కరిగిపోయి, పైపుతో పాటు నాజిల్స్ కూడా శుభ్రంగా తయారు అవుతాయట. ఈ విధంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి చేసినట్లయితే పైపు 6 నుండి 8 సంవత్సరాలు ఉపయోగించుకోవచ్చు అంటున్నాడు కృష్ణ.

ఈ విధంగా తన ఆలోచనతో తయారు చేసిన ఇన్నోవేషన్ వల్ల తన పని సులభం చేసుకోవటమే కాక, తోటి రైతులకు పరికరాన్ని తయారు చేసి వారికి కూడా లాభం జరిగేలా చేస్తున్న సామినేని కృష్ణ అభినందనీయుడు. ఈ పరికరాన్ని ఎవరైనా రైతులు ఆర్డరు ఇస్తే ఒక వారం రోజుల్లో దీన్ని తయారు చేసి ఇస్తానని, ప్రస్తుతం దీని ఖరీదు 12 వేల రూపాయలు అవుతుందని అంటున్నాడు. ఇది రైతుకు ఎంతో ఉపయోగవైనదని, ప్రభుత్వం లేదా ఎవరైనా స్వచ్ఛందంగా తనకు కొంత ఆర్థిక సహకారం అందిస్తే తానే స్వయంగా వర్క్‌షాప్ ఏర్పాటు చేసుకుని, అవసరమైన ఇనుప పైపులు, కడ్డీలను కూడా కొంత పెద్ద



మొత్తంలో కొనుగోలు చేసినట్లయితే ఇంకా తక్కువ ఖరీదులో నాణ్యమైన పరికరం తయారు చేసి ఇవ్వగలనని అంటున్నాడు సామినేని కృష్ణ.

సామినేని కృష్ణ తయారు చేసిన పరికరం రైతులందరు వినియోగించుకుని తమ శ్రమ, ఖర్చు, సమయం అన్నీ ఆదా చేసుకోవాలని కోరుతోంది 'పల్లెసృజన'. కృష్ణకు అవసరమైన ఆర్థిక సహాయం అందేందుకు, జాతీయ స్థాయిలో ఈ పరికరానికి గుర్తింపు వచ్చేందుకు కృషి చేస్తోంది.

**ఇన్నోవేటర్ సామినేని కృష్ణ ఫోన్ నెం.: 9866878742**

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేడు సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, వీరరాఘవ రెడ్డి, 8125799904

## 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు విజ్ఞప్తి

'పల్లెసృజన' పత్రిక అప్రతిహతంగా 17 సం.గా మీ ముందుకు వస్తున్న విషయం మీకందరికీ విదితమే. స్వచ్ఛం దంగా వాలంటరీ వ్యవస్థ మీద ఆదారపడి, వ్యాపార ప్రకటన లు, డొనేషన్‌లు లేకుండా ఇప్పటి వరకు ఈ పత్రికను తద్వా రా నూతన ఇన్నోవేషన్లను, ఇన్నోవేటర్లను సమాజానికి పరిచయం చేస్తూ వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో గుర్తింపు తీసుకు వస్తున్న విషయం కూడా మీకందరికీ తెలుసు. కోవిడ్ మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా సృష్టిం చిన అలజడి లో కూడా నిరాఘాటంగా పత్రిక నడిపే ప్రయత్నం లో సఫలీకృతులం అయ్యాము. కానీ, రోజు రోజుకూ పెరిగి పోతున్న పేపర్ ధరలు, ముద్రణా ఖర్చులను తట్టుకోవటం కొద్దిగా కష్టంగా మారుతోంది. కావున దయచేసి ఇన్నోవేటర్లు ఒక విషయం గమనించాలి. ఇప్పటి నుంచి మీకు చేరుతున్న పత్రిక ఉచితంగా పంపడం కొంత భారం గా అనిపిస్తోంది. కావున మీ పత్రికకు మీరు కూడా చందా దారులు కావల సిందిగా కోరుతున్నాము.

మీరు పత్రికకు అందిస్తున్న సహకారం మమ్మల్ని ఎప్పటిక ప్పుడు కార్యోన్ముఖులను చేస్తూ ముందుకు సాగేలా చేస్తోంది. కావున మీకు తెలిసిన వారికి, మీ మిత్రుల కు ఈ పత్రికను గురించి తెలియ జేసి, కొత్త చందాదారులను చేరేలా మీవంతు ప్రయత్నం చేయ గలరు. వీలైనంత వరకు పత్రిక ధర పెంచకుండా, చందా దారులను అధికం చేసినట్లయితే ముద్రణా ఖర్చు కొంత వరకు తగ్గుతుం దని భావిస్తున్నాము. 'పల్లె సృజన' ప్రతి పల్లెకు చేరాలన్నదే మనందరి ఆకాంక్ష. శుభ కార్యాల్లో ఈ పత్రిక చందానే మీరిచ్చే బహుమతిగా చేసుకుని పత్రిక ఎక్కువ మందికి చేరేలా చూస్తా రని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

# 'పల్లెసృజన' ఆధ్వర్యంలో హైదరాబాద్ లో "సి-20 లైఫ్" (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) వర్కింగ్ గ్రూపు సదస్సు




- జమ్మలమడక శశిమోహన్

భారత దేశం 'జి-20' దేశాలకు అధ్యక్ష పదవిలో 2023 నవంబర్ చివరి వరకు వ్యవహరిస్తుందన్న విషయం అందరికీ తెలుసు. ఈ జి-20 సమూహంలో రష్యా, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, భారత్, అమెరికా, జపాన్, యునైటెడ్ కింగ్‌డమ్, యూరోపియన్ యూనియన్ సమూహ దేశాలు లాంటి అగ్ర దేశాలతో పాటు, ఇటలీ, దక్షిణాఫ్రికా, టర్కీ, సౌదీ అరేబియా, ఇండోనేషియా, బ్రెజిల్ దేశాలు మొత్తం కలుపుకుని 20 ఉన్నాయి. వంతుల వారీగా ఈ జి-20 అధ్యక్ష పదవి ఒక్కొక్క దేశానికి అప్పగించ బడుతుంది. ఈ సంవత్సరం నవంబర్ వరకు భారత దేశం అధ్యక్ష పదవిలో ఉంటుంది. ఈ సమూహానికి అధ్యక్ష పదవి వహించిన దేశం సమూహంలోని మిగతా దేశాలకు వాణిజ్య, సాంకేతిక, శాస్త్రీయ అభివృద్ధి, సాంకేతిక జ్ఞాన మార్పిడి, ఆర్థికాభివృద్ధి మొదలైన విషయాలపై సంప్రదింపుల ద్వారా దిశా నిర్దేశం చేస్తుంది.

ఈ జి-20 అధ్యక్ష కాలంలో భారత దేశం పై విషయాలపై చర్చలు జరిపి, సలహాలు ఇస్తుంది. ఇది ప్రభుత్వ స్థాయిలో జరిగే కార్యక్రమం. ప్రభుత్వాలు కాక, ఈ 20 దేశాలలోని సివిల్ సొసైటీలు, ప్రజా సంఘాలు కలిసి నిర్వహించే కార్యక్రమాలు కూడా నిర్ధారించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో అనేక ఉప సంఘాలను నియమించింది. దానిలో 'సి-20' ఒకటి. ఈ 20 దేశాలలో సివిల్ సొసైటీలు, దాని సభ్యులు అందరూ చేపట్ట వలసిన బాధ్యతలను వివరించే ప్రక్రియలో "వాతావరణం, పరిసరాల పరిరక్షణ, ఆరోగ్యం, విద్య, స్త్రీ పురుషుల మధ్య సమానత్వం, కళలు, మానవ హక్కులు, సామాజిక విలువలు" మొదలైన విషయాలపై చర్చించి, ఈ 20 దేశాల లోని సివిల్ సొసైటీలు, ప్రజా సంఘాలకు సూచనలు చేసే కార్యక్రమం ఈ సి-20 చేస్తుంది. ఈ సి-20 చేసే కార్యక్రమాలలో భాగంగా "లైఫ్" (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) అన్న అంశం చాలా ముఖ్యమైనదిగా గుర్తించి, దీనిపై చర్చలు నిర్వహించి, తగిన సూచనలు చేయటానికి 'యోజక్' (సెంటర్ ఫర్ రీసర్చ్ & స్ట్రాటజిక్ ప్లానింగ్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్) సంస్థ అధ్యక్షులు డాక్టర్ 'గజానన్ డాంగే' గారికి అప్పగించడం జరిగింది. ఆయన ఈ పై విషయంపై విశేష అనుభవం వున్న "పల్లెసృజన" సంస్థను ఎన్నుకొని, దాని సహాయంతో "పునాది స్థాయి ఇన్నోవేషన్లు - జీవన విధానంపై వాటి ప్రభావం" అన్న అంశంపై హైదారబాద్‌లో ఒక జాతీయ స్థాయి సదస్సు నిర్వహించాలని కోరింది. ఈ సదస్సులో ముఖ్యంగా ఈ 20 దేశాలలో పునాది స్థాయిలో అనేక ఇన్నోవేషన్లు జరుగుతునే ఉన్నాయని, జీవన శైలిలో, జీవన క్రమంలో అదొక అంతర్భాగమని, పునాది స్థాయి వ్యక్తులు చదువుకున్న వారు, జ్ఞాన వంతులు కాకపోయినా, తాము తమ తోటి సమాజంలోని వ్యక్తులు ఎదుర్కొంటున్న అనేక రోజువారి సమస్యలకు తమకు తామే, తమకు తోచిన విధానంలో, లభించిన వనరులతో అతి తక్కువ ఖర్చులో పరిష్కారాలు, సమాధానాలు, అనేక వస్తువులు, ఉపకరణాలు, వైద్య విధానాల రూపంలో అందజేస్తూనే ఉన్నారు. పునాది స్థాయిలో జరుగుతున్న ఈ బృహత్తర కార్యక్రమం వివరాలు అన్ని దేశాలు పంచుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.

దీనికి 'పల్లెసృజన' అంగీకరించి, ఏప్రిల్ 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి ఏప్రిల్ 8వ తేదీ సాయంత్రం 6-30 గంటల వరకు హైదరాబాద్ తార్నాక ప్రాంతంలో వున్న జాతీయ స్థాయి సంస్థ 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ' (ఐఐసిటి)

ఆడిటోరియంలో నలుగురూ మెచ్చుకునే విధంగా నిర్వహించింది. దీనిలో అంతర్జాతీయ, జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులు, సివిల్ సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు, ఇన్నోవేటర్లు, రైతులు, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మొదలైన వారు ఎందరో పాల్గొన్నారు. కొందరు సదస్సులో ప్రత్యేకంగా పాల్గొనగా, మరి కొందరు ఆన్‌లైన్‌లో అంతర్జాలం (ఇంటర్‌నెట్) ద్వారా పాల్గొన్నారు. ఈ సదస్సులో ఢిల్లీ, అహమ్మదాబాద్, ఉభయ తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, గుజరాత్, మధ్య ప్రదేశ్ మొదలైన అనేక ప్రాంతాల నుండి ప్రతినిధులు హాజరైనారు. ఇంటర్‌నెట్ ద్వారా అమెరికా నుండి విశేషజ్ఞులు సభనుద్దేశించి ప్రసంగించారు. ఈ రెండు రోజుల సదస్సులో ప్రత్యక్షంగా ఐఐటి, ఎన్ఐటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు, ప్రభుత్వ ప్రతినిధులు కలసి దాదాపు పదివేల మందికి పైగా పాల్గొన్నారని అంచనా. ఈ సదస్సులో దాదాపు 25 మంది ఇన్నోవేటర్లు, ఇన్నోవేషన్ల ప్రదర్శన కూడా ఏర్పాటు చేయగా, పాల్గొన్న వారంతా ఇన్నోవేటర్లని ప్రశంసలతో ముంచెత్తారు. అనేక మంది ఈ ఇన్నోవేషన్లకు జాతీయ స్థాయిలో ప్రాచుర్యం కల్పించటానికి తగ్గ ఏర్పాట్లు చేయటానికి ముందుకు వచ్చారు.

ఈ సదస్సులో పాల్గొన్న వారు తీసుకున్న నిర్ణయాలను క్రోడీకరించి, ఈ యేడాది చివరిలో జి–20 దేశాల అధ్యక్షులు పాల్గొనే సమావేశంలో ఇతర దేశాలు ఆచరించడానికి అనుకూలంగా మార్గదర్శకాలు తయారు చేయటం జరుగుతుంది.

ఏప్రిల్ 7వ తేది మధ్యాహ్నం 2 గంటలకి జరిగిన ప్రారంభ సమావేశంలో 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు ముఖ్య అతిథులకి స్వాగతం పలికారు. ఈ ప్రారంభ సమావేశంలో 'యోజక్' సంస్థ అధ్యక్షులు డాక్టర్ గజానన్ డాంగే గారు ఎన్ఐఎఫ్ ఛైర్మన్ డాక్టర్ గోయెల్ గారు (అంతర్జాలం ద్వారా), సి–20 ప్రధాన సంధానకర్త విజయ్ నంబియార్ గారు, తెలంగాణ ప్రభుత్వ ఐటి ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయేష్ రంజన్ గారు తదితరులు పాల్గొన్నారు.

ముందుగా బ్రిగేడియర్ గణేశం ప్రసంగిస్తూ, ఈ సదస్సు నిర్వహించటంలో గల ముఖ్య కారణాలు, ఉద్దేశ్యము చెబుతూ 'పల్లె సృజన' నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ అతిథులకి స్వాగతం పలికారు. గజానన్ డాంగే మాట్లాడుతూ పునాది స్థాయి ఇన్నోవేషన్లు లేనిదే దేశ ప్రగతి సాధ్యం కాదని, ఈ విషయంలో 'పల్లెసృజన' వారు పునాది స్థాయి ఇన్నోవేషన్‌లను వెలికి తీసి, ఆయా ఇన్నోవేటర్లకు ప్రాచుర్యం కలిగించటంలో చేస్తున్న సేవ ఎంతో గొప్పదని కొనియాడారు. పునాది స్థాయి ఇన్నోవేషన్ల ద్వారా ప్రగతి, సంస్కృతి రెండూ సమాంతరం గా ముందుకు సాగుతాయి అన్నారాయన.






ఎన్.ఐ.ఎఫ్. ఛైర్మన్ డాక్టర్ పి.యస్. గోయల్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ పునాది స్థాయి ఇన్నోవేటర్లకి గుర్తింపు తీసుకు రావటం ఎన్ఐఎఫ్ ప్రధాన కర్తవ్యమని, ఈ మా ప్రయాసలో 'పల్లెసృజన' ఎంతో సహాయ కారిగా ఉంటోందని చెబుతూ, పూర్వ కాలంనుంచి కూడా భారతదేశం సృజనాత్మకత కలిగిన దేశమని, చదరంగం, 'సున్న' (0) శూన్యాన్ని మన ఊహకు అందని కాలం నుంచి ప్రపంచానికి అందజేశామని చెబుతూ ఎన్ఐఎఫ్ పాఠశాల పిల్లల సృజనాత్మక ఆలోచనలను కూడా సేకరించి ఉత్తమమైనవిగా ఎంపిక అయిన వాటికి రాష్ట్రపతి గారి ద్వారా బహుమతులు అందజేస్తుందని చెప్పారు. 6.4 లక్షల పాఠశాలల నుంచి 10 లక్షల ఆలోచనలను సేకరించామని, ఈసారి కూడా అదే స్థాయిలో చేయాలని ప్రణాళిక వేసుకున్నామని, బడి పిల్లల ఆలోచనలను సేకరించి వాటికి భౌతిక రూపమిచ్చి, వాటికి బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. ఎన్ఐఎఫ్ వద్ద అన్ని రంగాలకు చెందిన 1.6 లక్షల ఇన్నోవేషన్ల వివరాలు నిక్షిప్తం చేసి ఉన్నాయని, వాటిని ఎవరికి కావలసినా అందజేయ గలమని చెప్పారు. ప్రతి వ్యక్తీ శాస్త్రవేత కాకపోయినా, ఇన్నోవేటర్ అవ్వచ్చు అని చెప్పారు.

సి–20 ముఖ్య అధికారి షెర్పా విజయ కుమార్ నంబియార్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు, అన్ని హంగులు ఉన్న పరిశోదనాలయాలకన్నా పునాది స్థాయి నుంచి ఎక్కువ వస్తున్నాయని, అవి ఎంతోమంది జీవన శైలిని, జీవన విధానాన్ని మార్చివేస్తున్నాయని, మనవద్దనున్న సాంకేతిక పరిజ్ఞానమున్నవారు, శాస్త్రవేత్తలు ఈ పునాది స్థాయి ఇన్నోవేటర్లకు చేయూతనివ్వాలి అన్నారు. స్థానిక సమస్యలకి ఈ పునాది స్థాయి ఇన్నోవేటర్లు తమ చుట్టు ప్రక్కల లభించే వనరులతో విలువైన, చవకైన పరిష్కారాలు చూపిస్తున్నారని, దీనివలన ఎంతోమంది జీవితాల్లో గణనీయమైన మార్పు జరుగుతోందని అన్నారు. మనమందరం కలిసి ఇన్నోవేటర్లకి, వ్యాపారస్తులకి మధ్య సరైన అనుసంధానం చెయ్యగలిగితే ఇటు ఇన్నోవేటరు, వ్యాపారస్తుడు, సమాజానికి కూడా మేలు చేసిన వారం అవుతామన్నారు. ఈ సదస్సులో ఇటువంటి నలుగురికీ మేలు జరిగే నిర్ణయాలు తీసుకోవాలని కోరుకుంటున్నాను అన్నారు.

తెలంగాణ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ గారు మాట్లాడుతూ 'పల్లెసృజన' సంస్థ పునాది స్థాయి ఇన్నోవేషన్లు, ఇన్నోవేటర్లను వెలికి తీయటంలో చేస్తున్న కృషి ప్రభుత్వం దృష్టికి ఎప్పుడో వచ్చిందని, చాలాకాలం క్రితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తొలి రోజుల్లోనే 'పల్లెసృజన' సహాయంతో "ఇంటింటా ఇన్నోవేటర్" నినాదంతో రాష్ట్రంలోని అన్ని

జిల్లాలలో కొత్త ఇన్నోవేటర్లను గుర్తించి, వారికి దేశ అవతరణ దినము, గణతంత్ర దినము, రాష్ట్ర అవతరణ దినోత్సవాలలో వారిని సత్కరించి, జిల్లా స్థాయిలో అనేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాము అని చెప్పారు. పునాది స్థాయి ఇన్నోవేటర్లకు సహాయ సహకారాలు అందించటానికి దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రం ఇన్నోవేషన్ పాలసీ ప్రకటించిందని, 'టి-హబ్', 'టి-వర్క్స్' లాంటి వ్యవస్థల ద్వారా ఇన్నోవేటర్లకు చేయూతను అందిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో వీరిని చులకనగా చూడకుండా గ్రామీణ శాస్త్రవేత్తలుగా గుర్తించి తగు గౌరవం అందిస్తున్నామని చెప్పారు. ఇంగ్లీషు మాట్లాడ గలిగిన వారే శాస్త్రవేత్తలు కాదని, సమస్యకి పరిష్కారం చూపిన ఏ స్థాయి వారైనా శాస్త్రవేత్తలేనని 'పల్లెసృజన' నమ్మినట్లు వేమూ నమ్ముతామని చెప్పారు. తానీమధ్య 'గద్వాల' ప్రాంతంలో వేరుశనగ పొట్టు తీసే యంత్రాన్ని చూశానని, నర్సరీలలో మొక్కలు పెంచటానికి ప్లాస్టిక్ సంచుల బదులు వేరుశనగ పొట్టుతో చేసిన చిన్న కుండీలలో మొక్కలు పెంచే పద్ధతిని ఒక చిన్న విద్యార్థిని కనుగొన్నదని, ఆమెకి ప్రభుత్వం 'టి-వర్క్స్' ద్వారా సహాయం అందించగా, ఇప్పుడామె చదువుకొంటూనే వ్యాపారవేత్తగా మారి ఆర్జించడం మొదలు పెట్టింది అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని గణేశంగారు సన్మానించగా, వాలంటీర్ రాజేశ్వర్ రావు వందన సమర్పణ చేశారు.

తరువాత సదస్సును ఉద్దేశించి యోజక్ అధ్యక్షులు గజానన్ డాంగే ప్రసంగిస్తూ పునాది స్థాయి ఇన్నోవేషన్ల గురించి అర్థం చేసుకోవాలి అంటే ముందుగా ఐసిఎఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసర్చ్) వారు దేశాన్ని, వాతావరణ పరిస్థితుల ఆధారంగా 127 భాగాలుగా విభజించారని, ఒకచోట ఉన్న పరిస్థితులు, వనరులు మరో చోట ఉండవని, ఏ ప్రదేశం వారు వారి సమస్యలకు వారికి అందుబాటు లో వున్న వనరులతో పరిష్కారాలు ఆలోచించుకోవాలి అంటే దేశం మొత్తంమీద ఒకే ఇన్నోవేషన్ సంతృప్తిగా పని చేస్తుందని ఖచ్చితంగా చెప్పలేమని, దీనిని దృష్టిలో ఉంచుకొని 'ఇన్నోవేషన్లు ప్రజల జీవితం పై ప్రభావం' అనే విషయం ఆలోచించాలని సూచించారు. ఈ ప్రకారం ఆలోచిస్తే ఇన్నోవేషన్లు చేసేటపుడు డీసెంట్రలైజ్ చేయాలని, డైవర్సిఫై చేయాలని, ఇంటర్ కనెక్టివిటీ ఉండేలా చూసుకోవాలన్నారు. అంటే ఒకచోట పనిచేసే ఇన్నోవేషన్ మరోచోట చేయనవసరం లేదని, చేసినా మార్పు చేసుకోవాలని, ఇన్నోవేషన్లన్నీ ఒకేచోట కాక, వేరువేరు ప్రదేశాలలో చేసుకోవాలని, ఆయా ప్రాంతాలలో వున్న భౌగోళిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఇన్నోవేషన్లు ఉండాలని, ఏ ఇన్నోవేషనైనా ఆ ప్రాంత ప్రజలకి ఉపయోగ పడేలా ఉండాలని, వారిదాకా ఆ





సమాచారాన్ని చేరవేసే ప్రయత్నాలు జరగాలని చెప్పారు. దీంతో స్థానిక వ్యక్తులు, స్థానిక వనరులతో, స్థానిక సమస్యలకి పరిష్కారాలు కనుగొనే మార్గం సుగమమం అవుతుంది. అదే కావాలి, అదే చెయ్యాల్సింది కూడా. మిగతా జ్ఞానవంతులు, శాస్త్రవేత్తలు తామేమీ చేయకపోయినా, ఈ పునాది స్థాయి శాస్త్రవేత్తలకి సలహా, సహాయ సహకారాలు అందిస్తే చాలు.

ఇన్నోవేషన్లు చేసేటపుడు అధిక మోతాదులో టెక్నాలజీ వాడటం వలన ప్రకృతికి హాని చేసిన వారము అవుతాము. ఇన్నోవేషన్లు ఎప్పుడూ సులభంగా అర్థం చేసుకొని, సులభంగా ఉపయోగించేవిగా ఉండాలి. ఇన్నోవేషన్లలో రీ-యూజ్ (పునర్ ఉపయోగం), రీ-సైకిల్ (రూపం మార్చి వాడుకోవట), రెఫ్యూజ్ (తిరస్కరించడం), రిడక్షన్ (కుదించడం/ తగ్గించడం) చాలా ముఖ్యమని చెప్పారు.

ఏ రకమైన ఇన్నోవేషన్లనైనా ప్రజలు ఎక్కడ గుమికూడితే అక్కడ, పెళ్లయినా, పేరంటమైనా, పండగైనా అక్కడ అవకాశం తీసుకుని, ప్రదర్శించే ఏర్పాటు చేసుకోవాలి. ఈ లెక్కన ప్రత్యేక ప్రదర్శనలకన్నా, నలుగురూ గుమికూడే చోట ప్రదర్శించడం అలవాటు చేసుకోవాలి అన్నారు.

భారత ప్రభుత్వానికి సైన్స్ & టెక్నాలజీ (శాస్త్ర, సాంకేతిక శాఖ) సలహాదారుగా వున్న డాక్టర్ దేవ ప్రియదత్త ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ "భారీ సాంకేతిక జ్ఞానంతో చేసిన ఇన్నోవేషన్లు మనుషులను పట్టించుకోవని, అదే పునాది స్థాయి ఇన్నోవేషన్లు మనుషుల చుట్టూ ఉండే సమస్యలు పరిష్కరించటానికి ఉద్దేశించినవి కనుక మనుషులు - మనుషులకోసం చేసినవిగా నిలిచిపోతాయి. ఒక పెద్ద ఇన్నోవేషన్ ద్వారా దేశంలోని పేదరికం సమసిపోదు. కానీ, ఒక చిన్న ఇన్నోవేషన్ ద్వారా చుట్టు ప్రక్కల వారికి సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తుంది. ఎందుకంటే చిన్న ఇన్నోవేషన్లు వారు తీవ్రంగా అనుభవిస్తున్న సమస్యలకి పరిష్కారంగా పుట్టినవి కనుక. ప్రపంచ ఇన్నోవేటర్లతో పోలిస్తే మన దేశమేమీ తీసిపోలేదు. మనం మూడో స్థానంలో ఉన్నాము. ఇన్నోవేషన్‌లు అన్నవి సేవలలోనూ ఉండొచ్చు, తయారీ రంగంలో కూడా ఉండవచ్చు. ఏదీ తక్కువ కాదు. మనకి అందుబాటులో వున్న సంస్థలన్నీ చిన్న స్థాయిలో జరిగే సృజనలకి తోడ్పాటుగా నిలవాలి. ఇన్నోవేషన్ ఎప్పుడూ కష్టాన్ని తగ్గించాలే తప్ప నాణ్యతను తగ్గించకూడదు. అదేవిధంగా ఉత్పత్తిని పెంచాలి అన్న తాపత్రయంలో నాణ్యతని ఫణంగా పెట్టకూడదు.

ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఏ సాంకేతిక పరిజ్ఞానమైనా నేరుగా గ్రామీణ ఇన్నోవేటర్లకి సహాయం చెయ్యకపోయినా, వారు

సమస్యను చూసే దృక్పథంలో మార్పు వచ్చి, కనుగొన్న పరిష్కారాలలో మార్పులు తీసుకు రావటానికి దోహద పడుతుంది. అంటే గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్ సాంకేతిక పరిజ్ఞానంలో నిష్ణాతుడు అయి ఉండనవసరం లేదు" అన్నారు.

'ఆహార్ క్రాంతి' సంస్థ ముఖ్య అధికారి డా. ఎల్లోజీ రావు మీరాజ్కర్ అమెరికా నుండి ఆన్ లైన్‌లో మాట్లాడుతూ మనిషి పూర్వంలా కాక, తన 'కాగ్నేటివ్ స్కిల్స్' (అభిజ్ఞా నైపుణ్యాలు) మార్చుకోవలసిన సమయం వచ్చిందని, మనిషి తనని తాను ఇతరులను చూసే విధానం మారాలని, అవగాహన పెంచుకోవాలని చెపుతూ మానవుడు ఎదగడానికి శరీరానికి 53 లవణాలు కావాలని, ఇవన్నీ శరీరానికి అందేలా చెయ్యాలంటే మనం తినే ఆహారంలో, పండించే విధానంలో సరఫరా చేసే పద్ధతులలో మార్పులు రావాలనీ, ఇక్కడ సృజనాత్మకత ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు.

తర్వాత జరిగిన సమావేశంలో అమెరికా నుండి డా. ఎ.ఎస్. రావు గారు ఛైర్మన్‌గా వ్యవహరించగా, పద్మశ్రీ పురస్కార గ్రహీతలైన ఇన్నోవేటర్లు చింతకింది మల్లేశం, చింతల వెంకట్ రెడ్డిలు, రాష్ట్రపతి పురస్కార గ్రహీత గల్లా చంద్రశేఖర్, తమిళనాడుకు చెందిన 'సేవా' సంస్థ వ్యవస్థాపకులు పి. వివేకానందన్, హనీబీ నెట్‌వర్క్ ఒరిస్సా రాష్ట్ర సమన్వయకర్త డా. బలరాం సాహు, అంతర్జాతీయ పురస్కార గ్రహీత ఇన్నోవేటర్ అశోక్ గొర్రె మరియు గుజరాత్ ఇన్నోవేటర్, జాతీయ పురస్కార గ్రహీత హీరేన్ పంచాల్ మొదలైన వారు పాల్గొన్నారు.

ముందుగా డా. ఎ.ఎస్. రావు గారు మాట్లాడుతూ "ఏదైనా ఇన్నోవేషన్ జీవన విధానంపై మార్పు తెస్తుంది" అని మాట్లాడినప్పుడు మనకున్న కోట్లాది మంది జనాభాలో అనేక కోట్ల మంది జీవన విధానం మార్చినపుడే ఆ ఇన్నోవేషన్ జీవన విధానం మార్చింది అనుకోవాలి. ప్రపంచంలో ఆ స్థాయి ఇన్నోవేషన్లు లేవని, ఉన్నా చాలా తక్కువ అని చెప్పారు. కనుక మనం ఎప్పుడైనా ఇన్నోవేషన్లు జీవన శైలిలో మార్పుల గురించి మాట్లాడినపుడు కొద్ది మంది జీవితాల్లో మార్పు తెచ్చినా చాలు అని ఆలోచించాలి.

అమెరికాలో కూడా ఎంఐటి వారు ఇన్నోవేషన్ల పోటీలు పెడతారని, గెలుపొందిన వారికి బహుమానం ఇస్తూ, పెద్ద సంఖ్యలో ఉత్పత్తికై ఏర్పాట్లు చేస్తారని. అదే రూపంలో కాకపోయినా భారత దేశంలో అటువంటి పద్ధతే ఉందని, రాష్ట్రపతి పురస్కారాలు, పద్మశ్రీలు ఆ కోవకి చెందినవే అని చెప్పారు. ఇంకా అధిక సంఖ్యలో ఉత్పత్తి చేయటం అన్నది వేరువేరు సంస్థలు, వ్యక్తుల సహాయంపై ఆధారపడి ఉంటుంది అన్నారు.

చింతకింది మల్లేశం మాట్లాడుతూ "ఆసు యంత్రం చేనేత



కారుల జీవితాల్లో ఇంతటి మార్పు తీసుకు వస్తుందని నేను ఊహించలేదు. ఆసు పోయటం వల్ల చేతుల నొప్పులు తగ్గి, ఆరోగ్యంగా వుంటూ శ్రమ లేకుండా చీరలు నేస్తారు అనుకున్నాను. కానీ వారి జీవితాల్లో నేను ఊహించనదానికన్నా ఎక్కువ మార్పు కనపడటం ఎంతో సంతోషాన్నిస్తోంది. ఒక్క మగ్గంతో పని చేసే కుటుంబం ఇప్పుడు నాలుగైదు మగ్గాలతో తమ వృత్తిని కొనసాగిస్తూ, తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ, వారి చదువుల కోసం ఏకంగా హైదరాబాద్‌లో ఇల్లు కొని కాపురాలు పెట్టే స్థాయికి ఎదిగారు. అందరు చేనేత కారుల జీవన ప్రమాణాలు పెరగటం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అన్నారు.

చింతల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ "మట్టి వ్యవసాయం త్రికరణ శుద్ధిగా ఆచరించిన వాళ్ళ పంటలను ప్రకృతి వైపరీత్యాలు కూడా నష్టపోకుండా చేశాయనటానికి ఎన్నో రుజువులు ఉన్నాయి. ఉదా. ఘోరక్‌పూర్‌కు చెందిన ఒక రైతు చాలా నియమంగా తన బంగాళా దుంప పంటపై మట్టిని స్ప్రే చేయటం జరిగింది. గత జనవరిలో ఆ ప్రాంతంలో విపరీతమైన మంచు (ఫ్రాస్ట్) కురిసి తన చుట్టు పక్కల కనీసం 10 కి.మీ. మేర అందరి పంటలకు విపరీతమైన నష్టం జరుగగా, తన పంటకు ఏమాత్రం నష్టం జరుగలేదు. ఎందుకంటే అతను మట్టి ద్రావణం పిచికారి చేయటం వల్ల ఆకులపై పేరుకున్న మట్టి లేయర్ ఉండటం వల్ల మంచు పంటను తాకలేక పోయింది. ఇలా మన ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాంచల్, పంజాబ్, హర్యానా, ఛత్తీస్‌ఘడ్ లాంటి ఎన్నో రాష్ట్రాల్లో రైతులు ఆనందంగా ఉన్న విషయం వారు పంపే వాట్సాప్ గ్రూపుల ద్వారా తెలుస్తోంది" అన్నారు.

'సేవా' వివేకానందన్ మాట్లాడుతూ 'పల్లెసృజన' చేస్తున్న పనే తామూ తమిళనాడులో చేస్తున్నామని, ఈమధ్య మూలికా వైద్యాలపై ఎక్కువ దృష్టి సారిస్తున్నామని, అందుబాటులో వున్న మూలికా వైద్యాలకి ప్రాచుర్యం కల్పించడం కోసం మహిళా గ్రూపులు, సంఘాల సహాయం తీసుకుంటున్నామని చెప్పారు.

బలరాం సాహు మాట్లాడుతూ హనీబీ ముఖ్య ఉద్దేశ్యం ఇన్నోవేషన్లను సేకరించడంతో పాటు, ప్రముఖంగా వాటిని ప్రజల వద్దకి చేర్చటంలో ఎక్కువ ధ్యాస పెడుతుంది అన్నారు. ఏ విధంగానైతే తేనెటీగ ఒక పుష్పం నుండి మరో పుష్పానికి పుప్పొడి చేరవేస్తుందో అదేవిధంగా హనీబీ నెట్‌వర్క్ ఒకచోట ఉన్న జ్ఞానాన్ని మరో చోటికి చేరవేస్తుంది అన్నారు. ఈమధ్య కాలంలో పునాది స్థాయి ఇన్నోవేషన్లను, జ్ఞానాన్ని సంచార వాహనాల ద్వారా సుశిక్షితులైన సిబ్బంది సహాయంతో గ్రామ గ్రామాలకు వెళ్ళి ప్రచారం చేసే పద్ధతి ప్రారంభించామని చెప్పారు.



ఇన్నోవేటర్ అశోక్ గొర్రె మరియు హిరేన్ భాయ్ పంచాల్ తమ ఇన్నోవేషన్ల గురించి వివరించారు.

ఏప్రిల్ 8వ తేది ఉదయం 'పల్లెసృజన' బ్రిగేడియర్ గణేశం తెలుగు రాష్ట్రాలలో పునాది స్థాయి ఇన్నోవేటర్ల కొరకు చేపట్టిన అనేక సహాయ కార్యక్రమాల గురించి వివరిస్తూ, పునాది స్థాయి ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను భారీ స్థాయిలో ఉత్పత్తి చేయటం అన్నదానిపై దృష్టి పెట్టకుండా, తన ఇన్నోవేషన్ ను ఎంత ఎక్కువ మంది తయారు చేస్తున్నారు అన్నదానిపై దృష్టి పెట్టాలి" అన్నారు.




తర్వాత సమావేశంలో పునాది స్థాయి ఇన్నోవేటర్లను ఏవిధం గా రక్షించుకుని ముందుకు తీసుకు వెళ్ళాలి అన్న అంశంపై చర్చ జరిగింది. దీనిలో ఎన్.ఐ.ఎఫ్. ప్రధాన ఇన్నోవేషన్ ఆఫీసర్ విపిన్ కుమార్ ఆన్‌లైన్ ద్వారా, మన గ్రామ బజార్, ప్రధాన కార్యనిర్వహణాధికారి జాగర్లమూడి దుర్గా ప్రసాద్, విజ్ఞాన్ ఆశ్రమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. యోగేష్ కులకర్ణి (ఆన్‌లైన్), ఎన్ఐటి, వరంగల్ ప్రొఫెసర్ డా. ఆంజనేయులు, కాకతీయ శాండ్ బాక్స్ ప్రధాన కార్యనిర్వహణాధికారి మనీష్ జైస్వాల్, బిఎఐఎఫ్ కు చెందిన సంజయ్ పాటిల్ పాల్గొనగా సంధానకర్తగా కె.జి. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డా. రోహిత్ వ్యవహరించారు.

ఎన్ఐఎఫ్ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి డా. విపిన్ కుమార్ మాట్లాడుతూ "పునాది స్థాయి ఇన్నోవేటర్ల విషయంలో ఎంతో చేసినా, ఇంకా చేయవలసింది చాలా ఉందని, ఇన్నోవేటర్ల వివరాలు సేకరించడం కేవలం ఎన్ఐఎఫ్ పనే కాదు, ఇది ప్రతి ఒక్కరూ చేయవలసిన పని అన్నారు. ఒకరు సేకరించిన సమాచా రం ఇంకొకరికి చేరవేస్తేనే ఇన్నోవేషన్లకి ప్రాచుర్యం కలుగుతుంది అన్నారు. తమవద్ద వున్న సమాచారం ప్రకారం 15 వేల మంది ఇన్నో వేటర్లు 3 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నారని, పునాది స్థాయి ఇన్నోవేటర్లు ఉపాధి కల్పనలో తమవంతు పాత్ర పోషిస్తున్నారని గమనించాలి" అన్నారు.

యోగేష్ కులకర్ణి మాట్లాడుతూ "సాధారణంగా పునాది స్థాయి ఇన్నోవేటర్లు ఇబ్బంది పడేది సరైన సాంకేతికతను వాడక పోవటము, పెట్టుబడి పెట్టుకోలేక పోవటము, అనవసరపు ఖర్చులు పెట్టడము మొదలైన వాటివల్ల ఇబ్బందుల పాలవుతున్నారు. వీటన్నిటిని అధిగమిం చాలి అంటే పై విషయాలలో జాగ్రత్త పడితే సరిపోతుంది. అంతే కాకుండా, ఆలోచనలు వేరు, దానికి రూపకల్పన ఇచ్చే వ్యవస్థ వేరుగా ఉంటే పని సులువు అవుతుందేమో ఆలోచించాలి". అన్నారు.

ప్రొఫెసర్ ఆంజనేయులు మాట్లాడుతూ "విశ్వ విద్యాలయాల లోని వారికి కూడా రాని ఆలోచనలు మన పునాది స్థాయి ఇన్నోవేటర్ల



వద్ద ఉన్నాయని, చదువు కాదు ముఖ్యం ఆలోచన అని, విద్యా సంస్థలు కూడా తాము చెప్పే పాఠాలలో పునాది స్థాయి ఇన్నోవేషన్లని ఒక పాఠ్యాంశంగా చేర్చాలని, ప్రపంచాన్నే మార్చేయ గల శక్తి ఇన్నోవేటర్లకి ఉందని" అన్నారు.

సంజయ్ పాటిల్ మాట్లాడుతూ "మనకు తెలిసిన ప్రదేశాలలో నే కాక, మారుమూల ప్రదేశాలలో కూడా ఎంతోమంది ఇన్నోవేటర్లు ఉన్నారని, తనకి ఒకసారి ఎటువంటి మార్గం కూడా సరిగ్గా లేని గ్రామంలో ఒక మహిళ వద్ద నుండి 46 సాంప్రదాయ వైద్య విధానాలు నేర్చుకున్నానని" చెప్పారు.

మనీష్ జైస్వాల్ మాట్లాడుతూ "పునాది స్థాయి ఇన్నోవేటర్లని వెతికి వెలికి తీయటానికి స్థానిక సహాయం ఎంతో అవసరమని ఈమధ్యనే ఎంతోమంది యువకులు ఈ విషయంలో ముందుకు రావటం శుభ సూచకం" అని అన్నారు.

జాగర్లమూడి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ " పునాది స్థాయి ఇన్నోవేటర్లను వెతికి, వారికి బహుమతులు ఇప్పించటంతో వారి కడుపు నిండదని, వారి తెలివికి తగ్గ ఫలితం ద్రవ్య రూపంలో వారికి అందజేయ గలిగినపుడే అతను కనుగొన్న ఆవిష్కరణకు సార్థకత చేకూరుతుందని, 'మన గ్రామ బజార్' ఇన్నోవేటర్లు తయారు చేసిన వస్తువులను ప్రజలకి అమ్మటంలో సహాయం చేస్తుందని, ఇకముందు కూడా చేయాలని అనుకుంటు న్నామని" అన్నారు.

తరువాత మాన్యశ్రీ భాగయ్య గారు తమ ప్రత్యేక సందేశం ఇస్తూ "పల్లెసృజన పునాది స్థాయి ఇన్నోవేటర్ల విషయంలో గణనీయమైన సేవ చేస్తోందని, పారిశ్రామిక విప్లవంతో పల్లెలలో ఉత్పత్తి క్రమంగా తగ్గిపోయిందని, కర్మాగారాలు వెలసి భారీయెత్తున ఉత్పత్తులు మొదలు పెట్టడంతో ఆర్థిక వ్యవస్థే ఛిన్నాభిన్నమైందని దానికి తిరిగి పూర్వ వైభవం కలిగించాలి అంటే వస్తువులు సేవల తయారీ పట్టణాలు కర్మాగారాలలో కాక, తిరిగి గ్రామాలలో జరిగేలా చూసినపుడు ఊహించని స్థాయిలో అభివృద్ధి జరుగుతుందని, ఉపాధి లభిస్తుందని అన్నారు. ఈ ఆలోచన ప్రజలందరి దాకా తీసుకు వెళ్ళాలని, ఇన్నోవేషన్లు అన్నవి డబ్బు సంపాదనకే కాకుండా ప్రగతికి మార్గాలుగా మారాలన్నారు. మనది శ్రేయో రాజ్యమని, ప్రతి వ్యక్తి తాను చేసే పనిని తన ధర్మంగా యెంచి చెయ్యాలని, ఈ సందేశం నలుగురికీ చేరటానికి 'సివిల్ సొసైటీ' ముఖ్యపాత్ర పోషించాలి" అన్నారు.

తరువాత సభా విభాగంలో "పునాది స్థాయి ఇన్నోవేటర్ల రక్షణ – అభివృద్ధిలో అధికారిక సంస్థలు మరియు సివిల్ సొసైటీల పాత్ర" అన్న అంశంపై జరిగిన చర్చల్లో ఆన్‌లైన్‌లో ఉన్నత్ భారత్ అభియాన్



(యుబిఏ) జాతీయ సమన్వయకర్త డా. వీరేంద్ర కె. విజయ్ ఛైర్ పర్సన్‌గా వ్యవహరించగా, ఎన్ఐఎఫ్ ఉపాధ్యక్షులు డా. ఎన్.పి. రాజీవ్, విశ్రాంత నాబార్డ్ సిజిఎం పి. మోహ నయ్యు, తెలంగాణ ప్రభుత్వ అగ్రికల్చర్ హబ్ కార్య నిర్వహణా అధికారి డా. కల్పనా శాస్త్రి, గ్రామీణ యువ ప్రగతి మండల్ అవిల్ బోర్కర్ తదితరులు పాల్గొన్నారు.

డా. రాజీవ్ మాట్లాడుతూ "అధికారిక సంస్థలు పునాది స్థాయి ఇన్నోవేటర్లకు సహాయం చెయ్యాలి అన్నది ప్రస్తుతానికి, భవిష్యత్తుకి కూడా సంబంధించిన అంశమని, పునాది స్థాయి ఇన్నోవేషన్లు అన్నవి ప్రయోగ శాలల్లో కాక, నిజ జీవితంలోనుంచి పుట్టుకు వస్తాయని, వాటిని రక్షించుకోవటం మనందరి బాధ్యత అన్నారు. వీటిని రక్షించటంలో అధికారిక సంస్థలు చాలా పరిమిత పాత్ర  పోషిస్తున్నాయని, ఇతరుల మీద ఆధార పడకుండా ప్రభుత్వేతర సంస్థలే వీటిని కాపాడుకునే ప్రయత్నం చెయ్యాలి" అన్నారు.

అవిల్ బోర్కర్ మాట్లాడుతూ "తమ సంస్థ చాలా భాగం ఆదివాసీలతో కలిసి పని చేస్తుందని, కరువు కాటకాలు వచ్చినపుడు ఆదివాసీలు తమ ఆహారం కోసం ఇప్ప పూలపై ఎంతగా ఆధార పడతారో తెలుసుకొని ఆశ్చర్య పోయాము. ఇప్ప సారా వలన చెడు పేరు తెచ్చుకొన్న ఇప్ప పూలతో ఆదివాసీలు ఎన్నో రకాల ఆహార పదార్థాలు తయారు చేసుకుంటారు. ఇది ఎంతమందికి తెలుసు? మనకి తెలియని ఎన్ని బియ్యపు రకాలున్నాయో, వీటన్నిటికి ప్రాచుర్యం కల్పించి సమాజానికి తెలియజేయటం ఇంకెవరి బాధ్యతో కాదు, మనదే" అన్నారు.

మోహనయ్యు గారు మాట్లాడుతూ 'ప్రజా జీవితానికి సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వపు పాత్ర చాలా తక్కువగా ఉంటుంది. ఎవరో కొందరు సామాజిక స్పృహ కలిగిన వారు ముందుకు వస్తే, మిగతా వారు వారిని అనుసరించి సహాయం చేయడానికి వస్తారు. బయట మనకు తెలియని అనేక లక్షల కోట్ల ఇన్నోవేషన్లు ఉండవచ్చు. వాటిని వెలికి తీయవలసిన బాధ్యత మనందరిది, ప్రభుత్వానిది కాదు. అధికారిక సంస్థలలో కొన్ని పద్ధతులు మారిస్తే తప్ప పునాది స్థాయి ఇన్నోవేటర్లకు సహాయం చేయటం కుదరదు. ప్రారంభ దశలో ఒక వంద కోట్ల రూపాయల నిధి ఏర్పాటు చేసి, గ్రాస్ రూట్స్ ఇన్నోవేటర్లకి సహాయం చేయటానికి ప్రాథమిక సహకార సంఘాలు, ఎఫ్‌పిఓలు, ఇతర సంస్థల ద్వారా పునాది స్థాయి ఇన్నోవేటర్లను గుర్తించటం, వారికి సహాయం చేయటం కూడా చేయవచ్చు" అన్నారు.

కల్పనా శాస్త్రి మాట్లాడుతూ "తానూ 'పల్లెసృజన'లో భాగమేనని, అధికారిక సంస్థలు మునుపు చేసినంత ఉత్సాహంగా ప్రస్తుతం పునాది స్థాయి ఇన్నోవేటర్లకి సహాయం అందించలేక పోతున్నాయని, చేయవలసింది చాలా ఉందని, తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం పునాది స్థాయి ఇన్నోవేటర్లని ప్రతిదీ భారీ స్థాయిలో చేయమని ప్రోత్సహించకుండా పరిమితంగా స్థానిక అవసరాలకి తగ్గట్టు, స్థానిక వనరులతో, స్థానికంగా వాడకంపై దృష్టి సారించమని చెప్తోంది. తన హయాంలో అగ్రి హబ్ లో 7 ఇన్నోవేషన్లకు సహాయం అందించామని, ఉన్న సంస్థలు చాలని, కొత్తగా సంస్థలు రూపొందించాల్సిన అవసరం లేదని" అన్నారు.

తరువాతి సభా విభాగంలో "పునాది స్థాయి ఇన్నోవేషన్లు – యువత, బడి పిల్లలపై వాటి ప్రభావం" అన్న అంశం పై జరిగింది. దీనికి ఇంక్వీలాబ్ ఫౌండేషన్ ప్రోగ్రాం డిజైనర్ ఎన్. అఖిల సంధానకర్తగా వ్యవహరించగా, విశ్రాంత జెఎన్‌టియు ప్రొఫెసర్ ఎఆర్‌కె. ప్రసాద్, జికె. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డా. రోహిత్, ఇంక్వీలాబ్ సహ ప్రారంభకులు సాహిత్య అనుమోలు, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శ్రీమతి పుణ్యవతి (ఆన్‌లైన్), అమృత విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ మురళీ రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య మాట్లాడుతూ "పిల్లలు స్వాభావికంగా పెద్దలను అనుకరిస్తారని, వారికి అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తే ఏ పనైనా చేయగలరని చెబుతూ వారిని తగు రీతిగా మలుచుకోవటంలో ఉపాధ్యాయుడు, తల్లిదండ్రుల పాత్ర ఎంతైనా ఉంటుంది" అన్నారు.

డా. రోహిత్ మాట్లాడుతూ "పిల్లలకి సమస్యా పరిష్కారంలో శిక్షణ ఇవ్వాలని, విద్యా సంస్థలు కూడా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకునేందుకు తమ సంస్థ నుండి ఎంతమందికి ఉద్యోగం వచ్చింది అన్న విషయంపై దృష్టి పెట్టకుండా, తమ సంస్థ పేరుమీద పేటెంట్లు సంపాదించటాకి కృషి చేస్తే విద్య నాణ్యత పెరుగుతుంది, విద్యార్థులు ఉద్యోగానికి సిద్ధంగా తయారు అవుతారు" అన్నారు.

డా. మురళి మాట్లాడుతూ "విద్యార్థులని వారి హక్కులే కాక, వారి బాధ్యతలను కూడా తెలుసుకునేలా తీర్చి దిద్దాలి. వారు విద్యతో పాటు గ్రామీణ వాతావరణాన్ని కూడా అవగాహన చేసుకునే విధంగా తయారు చెయ్యాలి. ధర్మాన్ని జీవిత విధానంగా భోదించాలి. దయ, సంవేదన లాంటి భావాలు పిల్లలకు చిన్నతనం నుండి అబ్బేలా చెయ్యాలి" అన్నారు.

డా. ప్రసాద్ మాట్లాడుతూ "సమాజంలోని వ్యక్తులు పడే బాధను తాము పడ్డట్టుగా అనుభవ పూర్వకంగా తెలుసుకుంటేనే సరైన పరిష్కార మార్గాలు దొరుకుతాయి అన్న విషయం పిల్లలకు అర్థమయ్యేలా చెయ్యాలి. ప్రస్తుత యాంత్రిక జీవిన విధానంలో పిల్లల్ని పెంచటంలో తల్లిదండ్రుల పాత్ర పరిమితమై పోతోంది. అలా కాకుండా,



వారు కొంచెం శ్రద్ధ తీసుకొని పిల్లలతో నాణ్యమైన సమయాన్ని వెచ్చిస్తే పిల్లలని సన్మార్గంలో పెట్టడం సులభం. ఉపాధ్యాయులు కూడా కేవలం జీతం కోసమే పని చేయడం అన్న ఆలోచన మాని, పిల్లలకి జీవితం కేవలం ఉద్యోగము, సంపాదన మాత్రమే కాదు, పరిపూర్ణ జీవితం సాధించటమే విద్య యొక్క ఉద్దేశ్యమని తెలిసేలా చేసి వారికి ఆదర్శంగా నిలవాలి" అన్నారు.

పుణ్యవతి మాట్లాడుతూ "గ్రామాలలో ఉన్న విద్యార్థులకు తమ గ్రామంలోని పునాది స్థాయి ఇన్నోవేటర్లు రూపకల్పన చేసిన ఇన్నోవేషన్లను ప్రత్యక్షంగా చూపిస్తూ, వారిలో స్ఫూర్తి కలిగిచే ప్రయత్నం చెయ్యాలి. ప్రతి టీచరు తన ప్రభావం పిల్లల మీద ఉంటుంది అని గుర్తించి, దానికి తగ్గట్టు ప్రవర్తిస్తే పిల్లలని సమాజానికి పనికి వచ్చే వ్యక్తులుగా, భావి ఇన్నోవేటర్లుగా తయారు చెయ్యవచ్చు" అన్నారు.

తరువాత సభా విభాగం "జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జ్ఞానాన్ని పంచుకునే వేదికలు" అనే అంశంపై 'యోజక్' అధ్యక్షులు డా. గజానన్ డాంగే అధ్యక్షతన జరిగింది. ఇందులో ఐఐటి, న్యూ ఢిల్లీ నుండి ఉన్నత్ భారత్ అభియాన్ తరుపున ఆన్‌లైన్‌లో డా. వీరేంద్ర విజయ్, జిఐఎస్‌టిఎఫ్ అంతర్జాతీయ కన్వీనర్ డా. ఎల్లోజీ మీరాజ్కర్ (ఆన్‌లైన్), అటల్ ఇన్నోవేషన్ మిషన్ డైరెక్టర్ డా. చింతన్ వైష్ణవ్ (ఆన్‌లైన్), ఎన్ఐఎఫ్ నుండి డా. విపిన్ (ఆన్‌లైన్), భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ సలహాదారు డా. దేబి ప్రియ దత్త (ఆన్‌లైన్) తదితరులు పాల్గొన్నారు.

చింతన్ వైష్ణవ్ మాట్లడుతూ "ఇంత ముఖ్యమైన సమావేశంలో ప్రత్యక్షంగా పాల్గొనలేక పోయినందుకు చింతిస్తున్నానని, అటల్ ఇన్నోవేషన్ మిషన్‌లో అనేక అటల్ ఇన్నోవేషన్ కేంద్రాలు నడుస్తున్నాయి అని, అవి గ్రామాలలోనే కాక, పట్టణాలలో కూడా పునాది స్థాయి ఇన్నోవేటర్లకు అందుబాటులో ఉన్నాయని ఇవి కాక, 10 వేల 'అటల్ టింకరింగ్ సెంటర్'లు ఉన్నాయని, వాటిలో 40 శాతం గ్రామాల్లో ఉన్నాయని చెబుతూ గ్రామీణ స్థాయి ఇన్నోవేషన్‌లు అన్ని రంగాలకి చెందినవి అయివుంటాయి కనుక వాటికై ప్రత్యేకమైన సంస్థ ఉంటే బావుంటుందనే" అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఎల్లోజిరావు మాట్లడుతూ "అంతర్జాతీయ స్థాయిలో సాంకేంక శాస్త్రవేత్తల స్థాయిలో అభిప్రాయాలు, ఆలోచనలను పంచుకోవడానికి 'గ్లోబల్ ఇండియన్ సైంటిస్ట్స్ & టెక్నో క్రాట్స్ ఫోరం' (జిఐఎస్‌టి) ఉందని, దీనిని డా. అబ్దుల్ కలాం గారి హయాంలో ఏర్పాటు చేశారని, దాన్ని చాలామంది వాడుకుంటున్నారని, ఇందులో పునాది స్థాయి ఇన్నోవేటర్లకు కూడా స్థానం కల్పిస్తే బావుంటుందని" అన్నారు.





డా. వీరేంద్ర కె. విజయ్ మాట్లాడుతూ "గత రెండు రోజులుగా చాలా ముఖ్యమైన, ఆశాజనకమైన చర్చలు జరిగాయని, తమ సంస్థ తరుపున దేశంలో కమ్యూనిటీ ఇన్నోవేషన్ ఫెలోషిప్‌లు ఉన్నాయని, 50 ఇన్నోవేషన్ కేంద్రాలు కూడా పని చేస్తున్నాయని" తెలియజేశారు.

సదస్సులో చివరగా జరిగిన ముగింపు సమావేశంలో డా. గజానన్ డాంగే, బ్రిగేడియర్ గణేశం, ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌడేషన్ నుండి వినోద్ రావు, ఐఐసిటి డైరెక్టర్ డా. శ్రీనివాస రెడ్డి, ఉన్నత్ భారత్ అభియాన్ నుండి ఆన్‌లైన్ లో వీరేంద్ర కె. విజయ్ లు పాల్గొన్నారు.

ముందుగా కాకతీయ శాండ్ బాక్స్ కు చెందిన 'మనీష్ జైస్వాల్' ఈ రెండు రోజులుగా జరిగిన చర్చలను క్రోడీకరించి, క్లుప్తంగా వివరించారు. ఆన్‌లైన్‌లో ఉన్నత్ భారత్ అభియాన్ వీరేంద్ర కె. విజయ్ మాట్లాడుతూ "ఇంతటి బృహత్ కార్యక్రమాన్ని నిర్వహించటంలో సఫలీకృతులైన గజానన్ డాంగే గారిని, గణేశం గారిని అభినందించారు. ఈ సదస్సులో ఖచ్చితంగా తేలిన విషయం ఏమిటంటే, పునాది స్థాయి ఇన్నోవేటర్లు మన సంస్కృతిలో, అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు అన్నది. ఇక మన బాధ్యత వారి గురించి నలుగురికీ తెలిసేలా చేయటమే" అన్నారు.

బ్రిగేడియర్ గణేశం మాట్లాడుతూ "విభిన్న భాషలు, సంస్కృతు లు వున్న భారత దేశంలో పునాది స్థాయి ఇన్నోవేటర్లకు ఒక వేదిక కల్పించడం చాలా కష్టంతో కూడుకున్న పని అని, మేము గతంలో మూలికా వైద్యుల సదస్సు నిర్వహించినపుడు వారు వాడే మూలికలు, బెరడ్లను ఇతర భాషల్లోకి తర్జుమా చేయడానికి చాలా శ్రమ పడాల్సి వచ్చిందని, ఈ సి-20 వేదికనే జ్ఞాన మార్పిడి చేసుకోవడానికి తగ్గ వేదిక గా మలుచుకోవడానికి తగిన అవకాశాలు వెతకాలని, సి-20 ఎలాగో ప్రభుత్వాలతో నిమిత్తం లేకుండా నడుస్తున్నది కనుక ప్రభుత్వాల సహాయం లేకుండా పునాది స్థాయి ఇన్నోవేటర్ల జ్ఞానాన్ని అన్ని దేశాలు పంచుకొనే ఏర్పాట్లు మనమే చేసుకోవాలి" అన్నారు. "అసలు ఇంత పెద్ద కార్యక్రమం కేవలం స్వచ్ఛంద కార్యకర్తల సహాయంతో నిర్వహించ గలగ డం ఎంతో గొప్ప విషయమని, పల్లెసృజన కార్యకర్తలు రాత్రనక, పగల నక శ్రమించి ఈ కార్యక్రమం విజయవంతం అవటానికి తోడ్పడ్డారని. వారికి పల్లెసృజన మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తోంది" అన్నారు.

వినోద్ రావు మాట్లాడుతూ "తమ ఏకలవ్య ఫౌండేషన్ పనిచేసే తీరు వివరిస్తూ, ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వచ్చి నందుకు ధన్యవాదాలు చెప్పుకొంటూ పునాది స్థాయి ఇన్నోవేషన్‌ల ప్రసక్తి




జి–20 దేశాల వరకు తీసుకు వెళ్ళే అవకాశం రావటం ఆనందదాయకం అని చెపుతూ తమ ఏకలవ్య ఫౌండేషన్ లో 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించేలా ఏర్పాటు చేస్తాము" అన్నారు.

డా. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ "ఇంత మంచి కార్యక్రమం, ఇంత మంచి సందేశం ఇవ్వటానికి తమ సంస్థని ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని, తానీ సంస్థకు కొత్తగా వచ్చినా, ఇంతకు ముందు తాను పని చేసిన జమ్ము & కాశ్మీర్ లో ఈ పునాది స్థాయి ఇన్నోవేటర్లను చాలా దగ్గర నుండి చూశానని అక్కడ ల్యావెండర్ పుష్పాల దిగుబడి పెంచటానికి 'ఊదా రంగు విప్లవం' ప్రారంభించి అనేక ఔషధాలలో సుగంధ ద్రవ్యాలలో వాడే ల్యావెండర్ పుష్పాల దిగుబడిని 8 నుంచి 10 రెట్లు పెంచ గలిగారని, అదేవిధంగా అన్ని శీతోష్ణ పరిస్థితులను తట్టుకొని పెరిగే ఆపిల్ మొక్కల ఆవిర్భావం అక్కడే జరిగిందని, తమ సంస్థ స్వాతంత్ర్యం రాక పూర్వమే రీజనల్ రీసర్చ్ ల్యాబ్స్ (ఆర్. ఆర్. ఎల్.) పేరిట 1944 లోనే ప్రారంభించారని, తాము అనేక రంగాలలో రసాయనాలు ఎక్కడ వుంటే అక్కడ పని చేస్తామని, కరోనా సమయంలో కో–వ్యాక్సిన్ మందు కనుగొన్నపుడు అందులోకి కావలసిన ఒక రసాయనాన్ని తమ సంస్థే సమకూర్చిందని చెప్పారు. భవిష్యత్తులో కూడా మీరు చేస్తున్న కృషికి తమ సంస్థ సహాయం ఉంటుంది" అని హామీ ఇచ్చారు.

గజానన్ డాంగే మాట్లాడుతూ "ఈ సమావేశంలో అనేక రాష్ట్రాల నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు, ప్రతినిధులు పాల్గొని చక్కని, ఫలవంతమైన, ఆచరణ యోగ్యమైన సూచనలు చేసి నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జరిగిన చర్చల సారాంశానికి సమీప భవిష్యత్తులో ఇంకొన్ని సమావేశాలు జరిపి మొత్తం



నిర్ణయాలు ఒక పాలసీ పేపర్‌గా ప్రభుత్వానికి సమర్పిస్తామని, ఈ సమావేశంలో చెప్పలేని అంశాలు ఏమైనా ఉంటే వ్రాత పూర్వకంగా 'పల్లె సృజన'కు తెలియజేయ వచ్చునని చెప్పారు. పునాది స్థాయి ఇన్నోవేషన్ల విషయంలో 'పల్లెసృజన' చేస్తున్న సేవ చాలా గొప్పదని కొనియాడారు.

పల్లెసృజన వాలంటీర్ మహేష్ వందన సమర్పణ తో కార్యక్రమం ముగిసింది. ●

**(సదస్సుకు చెందిన మరికొన్ని చిత్రాలు సెంటర్ స్ప్రెడ్ లో చూడండి)**

## జి-20, సి-20 సదస్సు పై వాలంటీర్ పవన్ స్పందన

ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పుడమి ఆశీర్వచనాలతో
ఆకాశం మన ఆకాంక్షలకు నీడ కాగా
వాయువే మన ఉఛ్వాస – నిసాస్వసల విలువ పెంచగా
అగ్ని సమస్త సమస్యలను రూపుమాపే మన ఉన్నతమైన ఆలోచనలు కాగా
నీరే నిర్మలమైన మనసులను కలుపగా
పుడమే మన ఓర్పై మనకు తోడు నిలువగా
పంచ భూతాల పర్యవేక్షణ సాక్షిగా జరిగిన
ఈ జి–20 సదస్సు యొక్క సంవేదన
అద్వితీయం – అనిర్వచనీయం
ఇందు నేర్చిన అనుభవాలు ఆచరించి జీవించిన
మన జీవితాలు కాగలవు కారణజన్మం – విశ్వహితం
సకలం సఫలం, సస్యశ్యామలం
జై జవాన్ – జై కిసాన్ – జై గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్
సర్వేజనా సుఖినోభవంతు.

మీ
జీవీస్ ఫార్మర్స్ సన్
పవన్ స్ప్రింట్
(పవన్ కుమార్ వామిశెట్టి)
ఫోన్: 9550204448



# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

## పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు ఉపాధి

2005లో ప్రారంభమైన 'పల్లెసృజన' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇప్పటి వరకు కొన్ని వందల పునాది స్థాయి, గ్రామీణ యువతీ యువకులు తమ సృజనాత్మకతతో తయారు చేసిన ఇన్నోవేషన్లను తమ పత్రిక ద్వారా వెలుగులోకి తెచ్చిన విషయం మీకందరికీ విదితమే. ప్రస్తుతం దేశంలోని చాలా రాష్ట్రాలు, భారత ప్రభుత్వం కూడా ఈ దేశీయ పరిజ్ఞానం ఇంకా వెలుగులోకి రావాలని ప్రయత్నం చేస్తోంది.

ఈ పునాది స్థాయి (గ్రాస్ రూట్స్ ఇన్నోవేషన్స్) ఇన్నోవేషన్ల వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ పని జరగటమే కాదు, వీటి మరమ్మత్తుల కోసం తయారీదారుల వద్దకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఎక్కడికక్కడ ఆ గ్రామస్తులే స్వయంగా లేదా గ్రామంలోని పరిజ్ఞానం కల వ్యక్తులే చేయుటం వీటి ప్రత్యేకత. పైగా వీటి ఖరీదు కూడా సామాన్యులకు అందుబాటులో ఉన్నవే. మీ గ్రామంలో మీకు నచ్చిన పని చేసుకుంటూ ఉపాధి పొందటానికి మీకు అనువైన ఇన్నోవేషన్ను ఎన్నుకొని దాన్ని కొనుగోలు చేయుటం ద్వారా తక్కువ ఖర్చుతో ఉపాధి పొందటంతో పాటు, మీ గ్రామీణులకు అధునాతన టెక్నాలజీ అందించటం ద్వారా వారికి తక్కువ ఖర్చుతోనే మీరు పరిష్కారాలు చూపించవచ్చు. ఇలా గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పొందటానికి అనువైన 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలుసుకుందాం......

### మోటార్ సైకిల్ ట్రాలీ:

ప్రస్తుతం గ్రామాల్లో రైతులు ఎద్దులను పోషించలేక, వాటి ఖరీదు కూడా సామాన్య రైతు భరించే స్థితిలో లేకపోవటం వల్ల తమ పొలాలను కిరాయి ఎద్దులు లేదా ట్రాక్టర్ల ద్వారా పని చేయించుకుని తమ వ్యవసాయ పనులను కొనసాగిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. వ్యవసాయ పనుల కోసం ప్రతి రైతుకు ఎద్దుల బండి అవసరం. ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ దిగుబడులను ఇంటి నుండి పొలానికి,



పొలం నుండి ఇంటికి చేరవేయాలంటే ఎద్దుల బండి తప్పనిసరి. అటువంటి వారికి సహాయం చేస్తూ, ఆ సహాయం ద్వారా ఉపాధి పొందేలా చాలా తక్కువ ఖరీదులో లభించేలా 'కొండాలు నాయక్' అనే ఇన్నోవేటర్ మోటార్ సైకిల్‌కు అనుసంధానం చేసుకుని నడిపేలా ఒక ట్రాలీని తయారు చేశాడు. ఈ ట్రాలీని కొనుగోలు చేయటం ద్వారా రైతుకు అవసరమైన సరుకుల రవాణాకు, పొలానికి కూలీల రవాణాకు, కూరగాయలు లాంటి వాటిని సమీప మార్కెట్‌కు తరలించడానికి ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

మోటార్ సైకిల్‌కు ఎటువంటి హాని జరగకుండా, సులభంగా ఈ ట్రాలీని అనుసంధానం చేసుకుని, అవసరమైన వారికి తమ సేవలను అందిస్తూ, ఉపాధి పొందవచ్చు. పని పూర్తయిన తర్వాత ఆ ట్రాలీని మోటార్ సైకిల్ నుండి విడదీసి, మీ అవసరాలకు మోటార్ సైకిల్‌ను మామూలుగా వినియోగించుకోవచ్చు.

**చేతితో నడిపే వీడర్లు:**

బయలు పొలాన్ని దున్నుకోవటానికి ట్రాక్టర్లను కిరాయికి తీసుకోవటం ద్వారా చేసుకోవచ్చు కానీ, పంట వేసిన తర్వాత అంతర సేద్యాలు చేయాలంటే ట్రాక్టర్లతో సాధ్యం కాదు. కేవలం ఎద్దులను మాత్రమే కిరాయికి తీసుకొని అంతర సేద్యాలు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో ఎద్దులు కిరాయికి లభించటం కూడా లేదు అందుకు కారణం ఎద్దులను పోషించే వారు తక్కువ కావటమే. అటువంటి పరిస్థితుల్లో చేతితో నడిపే వీడర్లను కొనుగోలు చేయటం ద్వారా పొలాల్లో అంతర సేద్యాలు, పంటలకు ఎరువులు వేయటం, కలుపు తీయటం లాంటి పనులను సులభంగా చేసుకోవచ్చు. నిరుద్యోగ యువతీ యువకులు తమ ఆర్థిక స్థోమతను బట్టి ఈ వీడర్లు 35 వేల నుండి 1లక్షా 20 వేల వరకు లభిస్తున్నాయి. వీటి ద్వారా అంతర సేద్యాలు, ఎరువులు వేయటం, పురుగు మందులు పిచికారి చేయటం, వీటికి ట్రాలీను అనుసంధానం చేయటం ద్వారా పొలానికి ఇంటికి ఎరువులు, వ్యవసాయ దిగుబడుల రవాణా కూడా సులభంగా చేసుకోవచ్చు. ఈ వీడర్లకు ట్రాలీను అనుసంధానం చేసుకుంటే దాదాపు ఎద్దుల బండితో చేసే అన్ని రకాల పనులను సులభంగా చేసుకుని ఉపాధి పొందవచ్చు.



**పురుగు మందులు పిచికారి చేసే స్ప్రేయర్లు:**

రైతు అవసరాన్ని, నిరుద్యోగ యువత ఆర్థిక స్థోమతను బట్టి చాలా రకాల స్ప్రేయర్లను ఇన్నోవేటర్లు తయారు చేశారు. వరి మాగాణితో పాటు, అన్ని రకాల పంటలపై వీటి ద్వారా పంటలను ఆశించే చీడ పీడల నివారణకు పురుగు మందులు పిచికారి చేయవచ్చు. భుజాన వేసుకుని పిచికారి చేసే బ్యాటరీ స్ప్రేయర్లు, సైకిల్ మరియు మోటార్ సైకిల్‌కు అనుసంధానం చేసుకునే స్ప్రేయర్లు, ఎద్దుల బండిపైన ఏర్పాటు చేసుకునే స్ప్రేయర్లు, వీడర్లపై ఏర్పాటు చేసుకునే స్ప్రేయర్లు, పొలం గట్టున ఉండి కేవలం పైపును తీసుకుని పొలంలో తిరుగుతూ



పురుగు మందు పిచికారి చేసే స్ప్రేయర్లు, మూడు చక్రాల సైకిల్ స్ప్రేయర్లు ఇలా ఎన్నో రకాల స్ప్రేయర్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. తక్కువ కమతాలు గల రైతులకు బ్యాటరీ స్ప్రేయర్ ద్వారా, ఎక్కువ కమతాలు ఉన్న రైతులకు వీడర్ లేదా గట్టున స్ప్రేయర్ ఉంచి పొలంలో పురుగు మందు పిచికారి చేయటం ద్వారా ఉపాధి పొంద వచ్చు.

**విత్తనాలు వేసే జడిగం:**

ప్రస్తుతం రైతులు తమ పొలాల్లో విత్తనం నాటాలన్నా కూలీల లేమితో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. విత్తనం వేయటం ఆలస్యం అవుతుందని గతిలేని పరిస్థితుల్లో అదనపు కూలీ ఇచ్చేందుకు ఎంతో బాధ పడుతున్న విషయం ప్రతి గ్రామీణుడికే తెలిసిన విషయమే. కష్టపడే కూలీలు లభించక పోవటం కూడా ఇందుకు ఒక కారణం. విత్తనం నాటడం అంటే ప్రతి విత్తనానికి వంగి పొలంలో నాటి మళ్ళీ లేవటం, మళ్ళీ వంగటం .... ఈ ప్రక్రియ వల్ల నడుం నొప్పులకు గురి కావాల్సి వస్తుందని విత్తనం నాటడానికి కూలీలు రావటం లేదు. పైగా విత్తనాలను సరియైన దూరంలో, సరైన లోతులో నాటడం కూడా సాధ్య పడదు. ఎందుకంటే ఒక్కో వ్యక్తి ఒక్కో రకంగా విత్తనాన్ని పొలంలో నాటడం జరుగుతుంది. అందువల్ల పంట కూడా సమాంతరంగా ఎదగటం, మొక్కల మధ్య దూరం హెచ్చు తగ్గులు ఉండటం వల్ల సరియైన గాలి, వెలుతురు రాక దిగుబడిలో వ్యత్యాసాలు ఉండటం జరుగుతోంది.



ఈ సమస్యలన్నిటికీ పరిష్కారంగా చిన్న పరికరాన్ని తయారు చేశాడు 'గొర్రె అశోక్' అనే యువ ఇన్నోవేటర్. ఈ జడిగం ద్వారా సమాంతర దూరంలో, సరియైన లోతులో, మనిషి వంగి విత్తనం నాటాల్సిన అవసరం లేకుండా కేవలం నడుస్తూ పొలంలో విత్తనాలను నాటవచ్చు. ఈ జడిగాల ఖరీదు కూడా చాలా తక్కువ కాబట్టి గ్రామీణ యువత వీటిని ఎక్కువ సంఖ్యలో తీసుకుని, తోటి యువతను తోడుగా చేసుకుని, విత్తనాలు నాటే పని చేపట్టడం వల్ల ఊరంతా ఒకే రకమైన సమాంతర దూరంలో, సరియైన లోతులో విత్తనం నాటడం వల్ల రైతుకు శ్రమ, ఖర్చు తక్కువ కావటంతో పాటు, అధిక దిగుబడలను సాధించి పెట్టే పని మీరు చేసినట్లు అవుతుంది. దినితో పని చేయటం కూడా చాలా సులువు. కేవలం ఒకటి రెండు రోజుల్లోనే నైపుణ్యం తో విత్తనం వేసే వ్యక్తులుగా తయారు కావచ్చు. 5 నుండి 10 మంది యువతీ యువకులు జట్టుగా ఏర్పడి ఈ పరికరాలను తీసుకోవటం ద్వారా ఒక ప్రత్యేకమైన నైపుణ్యం గల విత్తనం వేసే జట్టుగా తయారు కావటంతో పాటు మంచి ఉపాధి కూడా పొందవచ్చు.

**(వచ్చేసంచికలో మరికొన్ని స్వయం ఉపాధి పరికరాలు)**

విశేషాలు

# ఏప్రిల్ 7-8 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన జి-20, సివిల్-20 సమావేశ దృశ్యాల్లో కొన్ని
































## 'ఉపాధి హామీ పథకం'

# శ్రమతో పాటు జ్ఞానపరంగా, రైతుకు అండగా ఉండాలి

### స్వల్ప కాలంలో భారతదేశ స్వరూపం మార్చేందుకు ప్రొ. అనిల్ గుప్తా పది సూత్రాలు



- స్వేచ్ఛానువాదం :
జమ్మలమడక శశిమోహన్



ప్రొఫెసర్ అనిల్ గుప్తా

**1.** సుమారు రెండున్నర కోట్ల జనాభాను 100 రోజులు కేవలం కూలి ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో అనవసరపు పనులు ఎందుకు చేయించాలి? పేదవాడికి కనీస జ్ఞానం లేదా? స్థానిక వనరుల పట్ల అతనికి ఉన్న పరిజ్ఞానాన్ని మనం ఎలా ఉపయోగించుకుంటాం? ఈ జ్ఞానం నుండి లభ్యమయ్యే సదుపాయాలను గుర్తించండి. మంచి విధానాలను క్రోడీకరించండి, వస్తువులను/ సేవలను రూపొందించండి. వాటిని విక్రయించండి. ఈవిధంగా సాంప్రదాయ జ్ఞానం, నైపుణ్యం కలిగిన సుమారు రెండున్నర కోట్ల ఔత్సాహికులను తయారు చేయండి. 10 సంవత్సరాలలో మనకు అసలు తప్పనిసరి పని కల్పించే విధానం అవసరమే ఉండదు. కళాశాలల్లోని యువత ఇలాంటి విషయాల్లో చాలా ఉపయోగ పడతారు. ఎన్.ఎస్.ఎస్. స్థానంలో ఎన్.ఐ.ఎఫ్.ను ప్రవేశ పెట్టి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కార్మికులు, మెకానిక్‌లు, వ్యవసాయ కూలీలు, రైతులు, వృత్తి విద్యా నిపుణులు, కళాకారులు మొదలైన వారిని ఈ రెండున్నర కోట్ల మందిలో గుర్తించడమే ముఖ్య ఉద్దేశ్యం.




**2.** చిన్న ఆర్థిక సంఘాలు పొదుపు చేసే మొత్తంలో కనీసం ఒక్క శాతం వారు తయారు చేసే వస్తువులు కొనుగోలు చేయడానికి ఉపయోగించడం లేదు. మనం వర్టికల్ మార్కెటింగ్ మీద చేస్తున్న పరిశోధనలు, సమాంతర మార్కెటింగ్ మీద చేయడం లేదు. మనము కొనుగోలు చేసే దాంట్లో కొంత శాతం తప్పనిసరిగా క్రింది స్థాయి వారు తయారు చేసే వసువుల కొనుగోలుకు ఉపయోగించాలి. వీటిలో ఆహార పదార్థాలు, తినుబండారాలు ముఖ్యమైనవి. స్వగృహ ఫుడ్స్ లాంటి సంస్థలలో తయారయ్యే సాంప్రదాయక వంటలు రుచిగా, శుచిగా, పోషక విలువలు కలిగి ఉంటాయి. గొప్పవాళ్ళు తరచూ తీసుకునే ఆహారం అతి తక్కువ స్థాయిదిగాను, పేదవాళ్ళు తరచుగా తీసుకునే ఆహారం అతి ఎక్కువ పోషక విలువలు కలిగినదిగాను, గొప్పగాను ఉంటుంది.



**3.** విజ్ఞానులై వుండి ఆర్థికంగా వెనుకబడి అనేక మంది నైపుణ్యంతో మన జీవితాలను ప్రభావితం చేసుకుంటూ కొంత సొమ్ము కొనుగోళ్ళ రూపంలో వారికి చేరేట్లు చెయ్యాలి. సృజనాత్మక భారతీయ సంస్కృతికి మనం ఒక చక్కని వెబ్ పోర్టల్‌ను రూపకల్పన చెయ్యాలి. రామాయణ గాథ, జానపద కథలు, పల్లె పాటలు, నాటికలు, దాసరి భాగవతాలు లాంటివెన్నో ప్రజలకు అసాధారణ మనశ్శాంతినిస్తాయి. అలాంటివి వెబ్ పోర్టల్‌లో లభ్యమైతే చాలా ఆనందంగా వాటిని డౌన్‌లోడ్ చేసుకోవటానికి సిద్ధపడతారు. ప్రతి డౌన్‌లోడ్‌కి ఒక్క రూపాయి చొప్పున పల్లె కళాకారులకు (స్వంత దారులకు) చెందాలి. ఈ విధంగా సంస్కృతి పరిరక్షణ పల్లెకళలను ప్రోత్సహించడంతో పాటు వారి జీవన భృతిని కూడా పెంపొందించే అవకాశం కలుగుతుంది. ఈ విషయంపై ఐఐఎం, అహమ్మబాద్ విద్యార్థులు ఒక ప్రాజెక్ట్ రిపోర్టు కూడా సమర్పించారు.



**4.** దేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 5 లక్షల టెక్నికల్ విద్యార్థులు ప్రాజెక్టు రిపోర్టులను సమర్పిస్తున్నారు. కాని అవి ఎంతవరకు అమలు చేయబడుతున్నాయి? ఎంత వరకు ఉపయోగ పడుతున్నాయి? మనం ఒక ప్రాజెక్టును 'రిలే' (ఖోఖో ఆటలా) తరహాలో ఒక కళాశాల నుండి మరో కళాశాలకు, అక్కడి నుండి మరో కళాశాలకు అలా అందిస్తూ పోతూ వుంటే చివరికి అది సమాజానికి ప్రయోజనకరమైన ప్రాజెక్టుగా మారి మార్కెట్ చేయటానికి సాధ్యమవుతుంది. చిన్న పరిశ్రమల ఇబ్బందులు విద్యార్థులకు తెలీడం లేదు. అలాగే క్షేత్రస్థాయి పరిశోధకులతో కలిసి వారు పని చేయడం లేదు. కనీసం ఒక్క శాతం ప్రాజెక్టులు నిజమైన సమస్యలకు పరిష్కారాలను సమకూరిస్తే




సంవత్సరానికి ఐదు వేల సమస్యలు పరిష్కరించబడతాయి. ఈ పరిష్కారాలను మనం చిన్నతరహా పరశ్రమలు, మరియుసామాజిక వర్గాల ద్వారా ప్రజల వద్దకు తీసుకు వెళ్ళాలి. అలాగే వారి ఆలోచనలను మార్కెట్‌లోకి తీసుకు రావాలి. దీంతో మనం ప్రాజెక్టులు వ్రాసే పరిశ్రమలను కూల్చివేయగలం. మౌళిక ప్రజ్ఞ (ఒరిజినాలిటీ) పై ప్రీమియం పెట్టడంతో సృజనాత్మక సహకరణ మరియు సానుభూతులతో సమ్మిళితమైన సంస్కృతికి మన విద్యార్థులు రూపకల్పన చేయాలి. జన్మనివ్వాలి.

**5.** భారతదేశంలోని 172 జిల్లాల్లో భారత రాజ్యాంగ శాసనాలు పూర్తిగా అమలు కావడం లేదు. న్యాయ నిర్ధారణలో, శాంతి భద్రతల నిర్వహణలో వివిధ తీవ్రవాదుల ప్రమేయం ఎక్కువగా ఉంటోంది. నిజ నిర్ధారణ చేయకుండా, హింసా మార్గం సమస్యలను ఎన్నటికీ పరిష్కరించలేదు. ప్రభుత్వం కూడా హింసా మార్గం అవలంభిస్తే అది మరిన్ని అనర్థాలకు దారి తీస్తుంది. నీరు, భూమి అడవుల నుండి విడదీయబడి, మోసపోయిన బీద ప్రజలు మరిన్ని కష్టాలకు గురి కాకుండా, వారి జ్ఞాన హక్కుల పోరాటంలో తోడ్పడటానికి ఇన్‌సర్‌జెన్సీ కార్యక్రమాన్ని మనం ప్రారంభించ గలమా? జాతీయ జ్ఞాన మిషన్ మెజారిటీ జనాభా జ్ఞాన సంపదతో తెగతెంపులు చేసుకుంది. ఈ కమీషన్ నైతికతను చరిత్రే నిర్ణయిస్తుంది.



**6.** నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఫిబ్రవరి 2000 సం.లో సుమారు 12,000 ఇన్నోవేషన్‌లతో మొదలు పెట్టి 500 జిల్లాల్లో లక్షన్నరకు పైగా సాంప్రదాయ విజ్ఞాన పరిశోధనలను సంగ్రహించింది. వీటిలో ఎన్ని పరిశోధనలు కళాశాలల, పాఠశాలల విద్యార్థులకు తెలుసు? వీటిలో ఎన్ని వ్యవసాయ దారుల పొలాల్లో, వర్క్‌షాప్‌లలో ప్రయత్నించబడ్డాయి? పరీక్షించబడ్డాయి? వీటిలో చాలావరకు ఎలాంటి నిబంధనలు లేక అందరికీ అందుబాటులో వుండగా, కొన్ని మాత్రం భారతదేశం, అమెరికా లాంటి దేశాల్లో పేటెంట్ హక్కులు కలిగి ఉన్నాయి. సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, సంస్కృతి రంగాల్లో వున్న అభివృద్ధి సంస్థలు ప్రజలతో కలిసి వారి సృజనాత్మకతను ఉపయోగించి, 'పల్లె ప్రజలు సమాజ అభివృద్ధికి ఉపయోగ పడరు' అన్న మనోభావాన్ని మార్చగలదా? గత మూడు సంవత్సరాల్లో ఐసిఎంఆర్, సిఎస్ఆర్‌లతో ఎన్ఐఎఫ్ భాగస్వామ్యం దాని ప్రయోగాత్మక ఫలితాలు మనకు తెలిసినవే కదా. శాస్త్ర విజ్ఞానానికి అశాస్త్రీయ జ్ఞానానికి మధ్య వారధి సత్ఫలితాలు చూపించడం ఆరంభమైంది. ఈ విషయంలో చేయవలసింది ఇంకా ఎంతో ఉంది. ప్రజాధనంతో నడిచే ప్రతి విద్యా సంస్థకు ఇలాంటి పల్లె విజ్ఞానాన్ని ప్రోత్సహించడాన్ని విధిగా ఎందుకు అమలు చేయడం లేదు? పరోక్ష పన్నులు ప్రజల ఆదాయంపై ఆధారపడవు కాబట్టి ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయాన్ని తెచ్చిపెడతాయి. అందుకే బీదవారు ధనవంతులకంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తారు. అందుకే పై సూచన పన్నులు చెల్లించే కొందరికి వెసులుబాటుగా ఉంటుంది. అంతేగాక ఇది విద్యా సంస్థలను జ్ఞానవంతులైన పేదలతో సంధానం చేస్తుంది. ఈ జ్ఞాన సంధానం ప్రస్తుత సమాజంలో వున్న లోటును పూరిస్తుంది.

**7. పల్లెనుంచి ప్రపంచానికి:** భారతదేశం స్వల్ప ఖర్చుతో అందుబాటులో వుండే పరిష్కారాలను వికాసపథంలోని ప్రపంచ దేశాలకు సమకూర్చడంలో నాయకత్వం వహించి, ఒక ఉదార, అతి శక్తివంతమైన ఆలోచనా

విధానాన్ని సూచిస్తుందా? పాశ్చాత్య దేశాలు సూచించే పరిష్కారాలు, మార్గాలు అత్యంత ఖర్చుతో కూడుకున్నవి. అసంబద్ధమైనవి. చైనా దేశ చూపే పరిష్కార మార్గాలు ఒకింత ఖర్చు తక్కువ అయినప్పటికి, అవి ఎక్కువ పరిమాణంలో తయారయ్యేవి కాబట్టి అందుబాటులో ఉండేవి. అయినప్పటికీ స్థానికంగా తయారు చేయడానికి ఔత్సాహికులకు అవకాశాలు కల్పించడానికి దోహద పడవు. దౌత్య పాలసీలో భాగంగా భారతదేశ, ఇన్నోవేటర్లకు ఆర్థిక పరిహారం ఇచ్చిన వారి ఇన్నోవేషన్లను ఉచిత ఆధార పరిష్కార పద్ధతిలో (ఓపెన్ సోర్స్) ప్రవేశ పెట్టాలి. పెట్టుబడులకు ప్రత్యేక ప్రణాళికను, విధానాన్ని తయారు చెయ్యాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉద్యోగావకాశాలను పెంచడానికి పెట్టుబడి తెచ్చే అవకాశాలను సృష్టించాలి. ఇది ఇన్నోవేషన్, పెట్టుబడి, వరిశ్రమ అనే ఈ మూడు ప్రధాన రంగాల మధ్య అంతర్జాతీయంగా ఒక కలయిక ఏర్పడాలి. చైనా ఇప్పటికే 'హనీబీ' మార్గంలో ప్రయాణం మొదలు పెట్టింది. బ్రెజిల్, ఇథియోపియా, ఫిలిప్పీన్స్, మలేషియా, ఇండోనేషియా మరెన్నో ఇతర దేశాలు ఈ దిశలో ఆలోచిస్తున్నాయి. మనదేశంలో క్షేత్ర స్థాయిలో తయారైన వస్తువులను ఆరు ఖండాల్లో ఇప్పటికే ఎన్ఐఎఫ్ మార్కెట్ చేస్తోంది. సరికొత్త ప్రపంచీకరణ ఆవిష్కరణకు నాంది పలుకుతోంది.

GRASS ROOTS GLOBAL

**8.** ప్రాథమిక విద్యాస్థాయిలో ఇలాంటి పరిశోధనలకు సంబంధించిన విషయాలను అధ్యయనం చెయ్యడానికి ఇప్పటికే అక్కడి ఉపాధ్యాయుల సహకారంతో నా మిత్రుడు ప్రొఫెసర్ విజయ్ షెర్రీచంద్ కార్యక్రమాలు ప్రారంభించాడు. చాలావరకు వీటి పరిష్కారానికి ఎక్కువ డబ్బుకన్న ఎక్కువ సమయం అవసరం. ఇటీవల ఇలాంటి పరిశోధనల విషయంలో తగు ప్రోత్సాహం ఇవ్వడానకి వివిధ విధానాలు రూపకల్పన చేయవలసిందిగా పోస్టల్ శాఖవారు కోరారు. ప్రతి పోస్టుమ్యాన్‌ను సృజనాత్మక వ్యక్తులను గుర్తించడానికి ఒక స్కౌట్‌లాగా తయారు చేయాలి అన్నది నా మొదటి సలహా. సృజనాత్మక మేధస్సు గల వ్యక్తుల ఉనికి మ్యాపు తయారు చేసుకొని దానిని ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తూ వుంటే అది సమాజంలోని అన్ని వర్గాలకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటుంది. అలాగే చొరవ చూపే సంస్కృతి, పరిశోధన, భాగస్వామ్యం మరియు స్థానిక స్థాయిలో సమాజానికి ఒక మంచి చేసే విధానం సంస్థాగతం అవుతుంది.




**9.** మార్కెట్ ప్రజల కష్టాలను గుర్తించదు. ప్రభుత్వాలు దీనికి మద్దతు పలుకుతున్నాయి. ఈ విషయంలో మరింత స్పష్టత కల్గించ వలసిన బాధ్యత సమాజానిది, సమకాలీన సాంఘిక ఉద్యమాలది. సృష్టి కారకం కానివ్వండి, వినాశకారకం కానివ్వకండి. ఒక తిరుగుబాటుకు మూలం సమాజం. మన గ్రహణ శక్తిని మరింత సంవేదన పూరితంగా తయారు చెయ్యాలి. సామాజిక ఉద్యమాలు, సామాజిక తిరుగుబాట్లలో అంతర్లీనంగా ఉన్న శక్తిని మనం విషయ సేకరణకు, బాధ్యతాయుత



కార్యకలాపాలకు ఉపయోగించుకునే దిశలో ఆలోచించాలి. అలాంటి ఉద్యమాలను మనం దారిలోకి తెచ్చుకుని జాతీయ స్థాయిలో సామాజిక తిరుగుబాట్లపై చర్చకు ద్వారాలు తెరిచినట్లయితే, సమాజంలో రేకెత్తే అలజడి, అసంతృప్తుల నుండి మనం ఎంతో నేర్చుకునే అరుదైన అవకాశం లభిస్తుంది. ఏ ఇతర దేశం ఇలాంటి సాహసానికి పూనుకోలేదు. ఈ విధానం ద్వారా దేశం తన బాధ్యతలను మరొకరితో పంచుకునే అవకాశం లభిస్తుంది. ఈ కేంద్రీకృత తిరుగుబాటు సామర్థ్యంతో తిరగబడుతుంది. నాగరిక జీవితంలో అసమ్మతి అనేది ఉప్పు లాంటిది. ఈ విషయంలో ఒక్క భారతదేశమే చొరవ చూపగలదు.

**10.** పరిశోధన భిన్న ఆలోచనలకు, విభిన్న వృత్తులకు ఒక దిశా నిర్దేశం చేసే స్విచ్ లాంటిది. విస్తృతంగా సమాజ సేవ అందించే వారికి అడ్డు వస్తున్న ప్రస్తుత విధానాలను, చట్టాలను దృష్టిలో పెట్టుకొని అలాంటి వారికి ప్రతి ప్రణాళిక (స్కీమ్)లో కనీసం 10 శాతం రాయితీ కల్పించగలమేమో ఆలోచించాలి. ప్రతి సంస్థలో ఉత్పత్తి ఖర్చు తగ్గించడానకి ప్రోత్సాహకాలు ఇచ్చే ఏర్పాటు చేసి, ప్రస్తుతమున్న నిశ్చిత లేదా సత్యదూరం కాని, గీచిన గీటు దాటడానికి వీలు కాని ఈ సిద్ధాంతాల నుండి చట్టాల నుండి ఒకింత భిన్నంగా తీవ్రవాద మార్పులకు అనుగుణంగా లేని బూజు పట్టిన పాత సిద్ధాంతాలను, చట్టాలను మార్పు చేసుకోవలసిన దశలో ఆలోచించాలి. అభిప్రాయ భేదాలను, విభిన్న ఆలోచనలను, బహుముఖ విస్తరణను దృష్టిలో పెట్టుకొని నిరంతర పరిశోధనలు సాగించినట్లయితే దేశాభివృద్ధికి ఒక స్థిరమైన, ఆమోదయోగ్యమైన రూపకల్పన చేయవచ్చు. ఇది ఎండమావి, మిథ్య అనే పదానికి తావు లేకుండా చేయవచ్చు.




**'పనికి ఆహార పథకం' వల్ల దేశంలోని అన్ని గ్రామాల్లోని రైతులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న విషయం అందరికీ విదితమే. ఈ సమస్యను పరిష్కరించడానికి ఈ పథకాన్ని "రైతుకు అనుసంధానం" చెయ్యటం వల్ల పరిష్కరించవచ్చునని భావిస్తోంది 'పల్లెసృజన'. ఈ పథకం క్రింద ప్రతి కూలీకి ప్రభుత్వం 250 రూ.లు ఇస్తుంటే ఆ పని అయిపోయిన తర్వాత కొంత మంది మాత్రమే రైతుకు కూలీకి వెళ్తున్నారు. వారికి రైతు రూ. 300 ఇస్తున్నాడు. ఇదే పనిని రైతుకు అనుసంధానం చేయటం వల్ల రైతు డబ్బులు, ప్రభుత్వం డబ్బులు మొత్తం ఒకరికే ఇవ్వటం వల్ల రైతుపని కుంటు పడకుండా నడుస్తుంది. దీనివల్ల ప్రభుత్వానికి ఖర్చు తగ్గుతుంది, రైతుకు కూలీల కొరత ఉండదు, రైతు కూలీలకు ఆదాయం ఉంటుంది... ఇది అందరికీ లాభమే కదా!**

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

**27301**

**పశువులకు తగిలిన గాయాలు మాన్పడానికి :**

పొలంలో దున్నేటప్పుడు, అడవులలో తిరిగేటప్పుడు ఇతరత్రా పశువులకు గాయాలు కావడం సర్వసాధారణం. సరియైన సమయంలో సరియైన చికిత్స చేయకపోతే అవి కురుపులుగా మారి ప్రమాద స్థాయికి చేరే అవకాశముంది. పశువుకి కూడా చాలా బాధగా వుంటుంది. దీనికి రకరకాల మందులు వాడినా తమిళనాడు తిరుచ్చి ప్రాంతానికి చెందిన 'పురై కొక్కలన్ వెలంకపట్టయ్' అనే రైతు ఒక సులభమైన చిట్కా వాడుతూ వుంటాడు.

పశువులకు గాయమైనపుడు అతను 'బొక్కెన ఆకు' గుప్పెడు తీసుకుని మెత్తగా నూరి ఆ ముద్దను గాయంపై వేసి కట్టు కట్టాలి. ఇలా రోజుకు ఒకసారి చొప్పున మూడు రోజుల పాటు చేస్తే గాయం నయమవుతుంది అంటారీయన.




**27304**

**పశువులలో కాలు వాపులు తగ్గటానికి :**

మనుషులకైనా, పశువులకైనా నడకలో ఏవైనా ఎగుడు దిగుడు మార్గం లేదా రాయి రప్ప లాంటివి వచ్చినపుడు వాటిని తప్పించుకునేందుకు నడిచే నడకలో కాలు బెణికి అది వాపు వచ్చే అవకాశం ఉంటుంది. అటువంటప్పుడు కాలుకి వాపు వచ్చే అవకాశముంటుంది. అప్పుడు పశువు నడవలేక బాధ పడుతుంటుంది. ఆ వాపు త్వరగా తగ్గటానికి తమిళనాడుకు చెందిన రైతులు ఒక చిట్కాను ఉపయోగిస్తుంటారు.

వారు 'సన్న జముడు' (లేత జొన్న పంట ఆకులు) ఆకులను ఈనెలు లేకుండా తీసి, అందులో కొద్దిగా వాము కలిపి ముద్దగా నూరి ఆ మిశ్రమాన్ని 50 మి.లీ. వేపనూనె లో మరిగించి, చల్లారిన తర్వాత పశువుకు వాపున్న కాలికి కట్టుగా కడితే వాపు త్వరగా తగ్గుతుండటంతో ఈ పద్ధతిని విరివిగా ఉపయోగిస్తూ వుంటారు.



**27307**

**రసంపీల్చే పురుగులు, చీడల నివారణకు సేంద్రియ మందు :**

ఎక్కువగా కూరగాయల మొక్కలు మరియు ఇతర పంటలపై రసంపీల్చే పురుగు సోకిందంటే దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశముంటుంది. వీటికి సరియైన సమయంలో నియంత్రణ మార్గాలను ఉపయోగించడం ఎంతో అవసరం. గుజరాత్ రాష్ట్రానికి చెందిన చోటా ఉదేపూర్‌లోని 'రవిదాస్‌భాయ్ రాందాస్ భాయ్ రత్వా' అనే రైతు ఒక సేంద్రియ పద్ధతిలో తయారు చేసుకున్న మిశ్రమాన్ని వాడుతూ వుంటాడు. దీనికతను 5 కిలోల వేప ఆకులు, 2 కిలోల జిల్లేడు ఆకులు, మొగ్గలు, పూలను సేకరించి, వాటికి ఒక కిలో 'చెంగ నార', ఒక కిలో తక్కెల ఆకు, ఒక కిలో అడ్డసరం ఆకులు, ఒక కిలో మెంతుల పొడిని కలిపి 25 లీటర్ల గోమూత్రంలో కలిపి 15 రోజుల పాటు గాలి చొరబడకుండా మూత బిగించిన డ్రమ్ములో వేసి మురగబెడతాడు. తర్వాత దీన్ని వడగట్టి, 15 రోజులు పాతబడిన పులిసిన మజ్జిగలో కలిపిన తర్వాత 14 లీటర్ల నీటిలో ఒకలీటరు ఈ మిశ్రమాన్ని కలిపి 6 రోజులకోసారి చొప్పున రెండు లేదా మూడుసార్లు పంటలపై పిచికారి చేస్తాడు. ఇలా చేయటం వల్ల రసంపీల్చే పురుగులు, ఇతర చీడల పీడ కూడా వదులుతుంది అంటారీయన.

**27311**

**పశువుల పేగులలో నులిపురుగుల నివారణ చికిత్స :**

పశువులలో ముఖ్యంగా దూడలలో నులిపురుగుల తాకిడి ఎక్కువగా వుంటుంది. ఇలాంటప్పుడు పశువులు, దూడలు ఎక్కువగా పారుకుంటూ వుంటాయి. ఈ నులిపురుగుల నివారణకు గుజరాత్‌కు చెందిన 'కమలాబా పున్సీన్ జాలా' అనే మహిళా రైతు ఒక చికిత్సను ఉపయోగిస్తూ వుంటుంది. ఆమె 200 గ్రా. గరిక గడ్డిని తీసుకుని మెత్తగా నూరి నీటితో కలిపి ఆ ద్రావకాన్ని రోజుకి రెండుసార్లు చొప్పున 3 రోజులపాటు పశువుకు తాగిపిస్తుంది. దీంతో నులిపురుగులు



నివారించబడతాయి అంటుందామె.

దీనికే ఆమె మరో పద్ధతిని కూడా ఉపయోగిస్తూ వుంటుంది. 'తెల్ల దురదగొండి' కాయలను తీసుకుని మెత్తగా నూరి పులిసిన మజ్జిగలో కలిపి పశువు చేత తాగిపిస్తుంది. ఈ పద్ధతి కూడా సమర్ధవంతంగా పని చేస్తుంది అంటుందీమె.

**27309**

**పత్తిలో గులాబి రంగు పురుగుల నివారణకు :**

ప్రత్తి పంటలో గులాబిరంగు పురుగు ఆశించినచో అవి కాయలలో తమ స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని వుంటాయి కనుక ఆ కాయ ప్రత్తి బాగా పగలదు, విత్తనాలను ఈ పురుగులు తినేస్తాయి కనుక పత్తి తూకం రాదు, నాణ్యత కూడా ఉండదు. దీని నివారణకు గుజరాత్‌కు చెందిన 'నాబ్జీభాయ్ డెత్రోజా' అనే రైతు సేంద్రియ పురుగు మందును కనుగొన్నాడు.

ఇతను దీని నివారణకు గోమూత్రము, వేప కాయలు, కుంకుడు కాయలను ఉపయోగిస్తాడు. ఈ మిశ్రమం తయారు చేయటానికి అతను 5 కిలోల ఎండిన వేప కాయలను పొడిగా చేసి, అందులో 500–700 గ్రా. కుంకుడు కాయల పొడిని కలిపి ఈ మిశ్రమానికి 10 లీటర్ల గో మూత్రంను జోడించి, ఆరు రోజుల పాటు మురగబెట్టిన తర్వాత దీన్ని వడగట్టి 250 మి.లీ. మిశ్రమాన్ని 15 లీటర్ల నీటిలో కలిపి ప్రత్తి పంటపై ఉదయం, సాయంత్రం పిచికారి చేస్తాడు.



ఇదే మిశ్రమాన్ని బెండ పంటపై కూడా వాడి మంచి ఫలితాలను పొందాను అంటున్నాడు నాగ్జీభాయ్.

**రెండుసార్లు నాటు వేయటం ద్వారా 'క్యాబేజి, క్యాలిఫ్లవర్' పంటల అధికోత్పత్తి :**

ఒరిస్సాలోని సుందర్ ఘర్ ప్రాంతంలోని స్థానిక కొండజాతివారు క్యాలిఫ్లవర్, క్యాబేజి పంటల అధికోత్పత్తికి ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ముందుగా విత్తనాలను నారుమడిలో పోసి, మారాకు మొలకెత్తిన తర్వాత ఆ మొలకలను జాగ్రత్తగా తీసి ఇంకొక మడిలో నాటాలి. అక్కడ మొక్కకి దాదాపు ఎనిమిది ఆకులు వచ్చేవరకు ఉంచాలి. ఆ తర్వాత వాటిని తీసి పొలంలో నాటినచో ఆ మొక్క బలంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు, అధికోత్పత్తిని ఇస్తాయి.



**కాకర ఆకుల రసంతో పశువుల పుండ్లకు వైద్యం :**

ఒరిస్సాలోని తర్చర్ అనే గ్రామ ప్రజలు తాజా కాకర ఆకులను మెత్తగా దంచి, ఆ ముద్దను పశువుల పుండ్లు, గాయాలపై పూయటం ద్వారా అవి త్వరగా మానిపోవటం జరుగుతోంది. దీనివలన గాయాలు త్వరగా మానటమే కాకుండా, క్రిమి కీటకాలను కూడా దరి చేరకుండా



నిరోధిస్తుంది. ముద్దగానే కాకుండా కాకర ఆకులను చేతితో నలిపి ఆ రసాన్ని గాయంపై వేస్తే కూడా గుణం కనిపిస్తుంది. ప్రకాష్ అనే రైతు ఈ పద్ధతిలో చాలా పశువులకు ఉపశమనం కలిగించాడు.

**నిమ్మజాతికి చెందిన దబ్బ (కర్ణ) కాయ చెట్ల ఆకులతో పశువులలో నులిపురుగుల నివారణ :**

ఒడిషా రాష్ట్రంలోని పూరి, అంగూల్, కలహంది ప్రాంతాల్లోని ప్రజలు దబ్బ (కర్ణ) కాయలను ఆహారంలో వాడుతారు. కానీ లక్ష్మీబెన్ (60 సం.) ఈ చెట్ల ఆకులను పశువులలో నులి పురుగుల నివారణకు వాడుతుంది. ఆమె మూడు నాలుగు ఆకుల రసానికి కొద్దిగా ఉప్పు కలిపి, 150 మి.లీ. నీటిలో కలిపి జ్యూస్ తయారు చేసి పశువులచేత తాగిపిస్తుంది. దీంతో పశువుల కడుపు శుభ్రపడి కడుపు నొప్పితో పాటు నులి పురుగులు కూడా నివారించబడతాయి. ఈ పద్ధతిలో ఈమె ఎన్నో దూడలకు వైద్యాన్ని చేసింది.






**ప్రత్తి నాటడంలో నర్సరీ పద్ధతి :**

గుజరాత్‌కు చెందిన కేశవ్‌భాయ్ 1999 నుండి తన పొలంలో 'శంకర్–4' అనే హైబ్రిడ్ ప్రత్తిని నాటేవాడు. వర్షాలు బాగుంటే ఫర్వాలేదు కాని, వర్షాభావ పరిస్థితుల్లో పొలంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్తి మొక్కలు ఏపుగా పెరగక పోవడాన్ని గమనించాడు. ఈ సమస్య పరిష్కారం కొరకు అతను పొలంలో ప్రత్తి నాటినప్పుడే కొన్ని విత్తనాలను నర్సరీ పద్ధతిలో విడిగా కుండీలలో పెంచాడు. వీటిని 25 గ్రా. ఆవుపేడ, 50 గ్రా. మట్టి కలిపి అందులో మొక్కలు నాటేవాడు. తక్కువ ఎండ వుండేచోట వీటిని తగినంత నీరు పోసి 25 నుండి 30 రోజుల వరకు పెంచుతాడు.


ఈలోగా పొలంలో వేసిన ప్రత్తి మొక్కలలో ఏవైనా



మొలకెత్తకపోయినా, లేదా సరియైన ఎత్తుకు ఎదగకపోయినా ఈ కుండీలలోని మొక్కలను అక్కడ నాటేస్తాడు. దాంతో పొలంలోని మొక్కలన్నీ ఒకే ఎత్తులో, ఒకే వయస్సులో వుండటం వల్ల ఒకేరకమైన కాపు ఇస్తున్నాయి. కేశవ్ భాయ్‌ని చూసి చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని చాలామంది రైతులు ఇదే పద్ధతిని అవలంభించి, వనరులను మితంగా వాడటమే కాకుండా, అధికోత్పత్తిని సాధిస్తున్నారు.

**పశువులు చూలుకు రావటానికి చిట్కా :**

పశువులలో వేడి అధికమైనపుడు అవి చూలుకు రాకపోవడమే కాదు, పాల దిగుబడి కూడా తగ్గుతుంది. దీనికి విరుగుడుగా గుజరాత్‌కు చెందిన భారత్ సిన్హా ఒక కిలో 'శతావరి' అనే ఔషధ మొక్క వేళ్ళు, ఒక కిలో మర్రిచెట్టు బెరడు కలిపి మెత్తగా పొడిచేసి రోజుకు 500 గ్రా.ల చొప్పున, నాలుగు రోజులపాటు పశువుకు దాణాలో కలిపి తినిపిస్తే మంచి ఫలితం వుంటుందని, ఒక వారంలో పశువు చూలుకు సిద్ధమవుతుందని అంటున్నాడు. ఈ చిట్కాను ఇతను తన తండ్రి రామ్‌సింగ్ భాయ్ వద్ద నేర్చుకున్నానని, ఆయనా ఇదే పద్ధతిని అవలంభించేవాడని చెబుతున్నారు.



మీకు తెలిసిన 'పల్లెజ్ఞానం' మీవద్ద ఏదైనా ఉంటే మాకు పంపండి. మీ పేరున ఆ జ్ఞానాన్ని ప్రచురిస్తాము. మీవద్ద వున్న జ్ఞానం మీతో అంతరించి పోకుండా పదిమందికి ఉపయోగ పడేలా చూడండి. – ఎడిటర్

'హనీబీ నెట్‌వర్క్', 'పల్లెసృజన' ల ద్వారా వెలుగులోకి వచ్చిన

## 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న సామాన్యులు

## Padma Shri Awards

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

# దివ్యాంగ కృషీవలుడికి 'పద్మశ్రీ'



సృష్టి సమ్మాన్ - 2009



పద్మశ్రీ పురస్కారం - 2017

గుజరాత్‌లోని బనస్కంతా జిల్లా దిశ తాలూకాలోని 'సర్కారీ గోరియా' గ్రామానికి చెందిన, ''గేనాభాయ్ పటేల్'' అనే రైతు చిన్నతనంలోనే పోలియో కారణంగా రెండు కాళ్ళు పని చెయ్యని వాడై ఉండి కూడా పరిస్థితులను ఎదుర్కొని దానిమ్మ రైతుగా దేశంలోనే తనకంటూ ఒక గుర్తింపు సంపాదించుకున్నాడు.

ఈయనకి 'సృష్టి సమ్మాన్' పురస్కారం 2015లో లభించగా, భారత ప్రభుత్వం 2017లో 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. 'దానిమ్మ అన్న (దాదా)' అని చుట్టుప్రక్కల వారు ప్రేమగా పిలుచుకునే ఈయనని అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు కూడా వరించాయి.

ఈయన ఆ ప్రాంతానికి, తనకి కూడా కొత్తయిన దానిమ్మ పండించి తానే కాక మరో 60 వేల మంది రైతులకి మేలు చేకూర్చాడు.

జిమ్నాస్టిక్స్‌లో, ఒలింపిక్స్ పోటీలకి అర్హత పొందిన తొలి మహిళ 'దీపా కర్మాకార్, విరాట్ కోహ్లీ, ప్రసిద్ధ చెఫ్ సంజీవ్ కపూర్‌ల లాంటి దిగ్గజాలున్న 'పద్మశ్రీల జాబితాలో గుజరాత్ లోని బనస్కాంత జిల్లాలోని సర్కరీ గోలియా గ్రామంలో నడవలేని ఒక దానిమ్మ రైతుకి కూడా చోటు లభించటం కేవలం అతని పట్టుదల, ఆత్మ విశ్వాసం వల్ల మాత్రమే సాధ్యపడిందని చెప్పాలి.

సవాళ్ళు లేనిదే జీవితమే లేదు, అసలు సవాళ్ళు లేని జీవితంలో ఆనందం ఉండదు అంటాడాయన. అందరూ ఎక్కడ ఆగిపోతారో అక్కడి నుంచే నేను ప్రారంభిస్తాను అని చెపుతూ నేను సాధించలేనిది ఏదీ లేదు అని నాకు ఎప్పుడు అనిపించలేదు. అదేదో ఇంగ్లీషులో చెప్పినట్టు అసాధ్యం అన్న పదం నా డిక్షనరీలో లేదు అంటాడాయన. మధ్యలో చచ్చుబడిపోయిన తన రెండు కాళ్ళనీ చూస్తూ.

కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు, ఒక అక్కలలో చిన్నవాడు 'గేనాభాయ్ పటేల్'. పుట్టుకతోనే పోలియో వ్యాధితో ఇతని రెండు కాళ్ళు చచ్చుబడిపోయాయి. చిన్నప్పుడు అన్నలు తన తండ్రికి పొలం పనులలో సహాయం చేస్తుంటే నువ్వు చెయ్యలేవు కదరా నువ్వు బడికెళ్ళి బాగా చదువుకో అనేవాడు తండ్రి. అప్పుడు తానెప్పటికీ వ్యవసాయం చెయ్యలేను అనుకొనేవాడు గేనాభాయ్. చిన్నతనంలోనే తమ ఊరికి 30 కిలోమీటర్ల దూరంలో వున్న ఒక హాస్టల్‌లో నివాసం ఏర్పాటు చేసి దగ్గరలోని పాఠశాలలో చేర్పించారు. ఒక మూడు చక్రాల బండిలో స్కూలుకెళ్ళి చదువుకొనేవాడు. అలా 12వ తరగతి వరకు చదివాడు. తరవాత ఏం చదవాలో ఇతనికి తెలియదు, ఏం చదివించాలో చదువుకోని తన తండ్రి కీ తెలియదు. చదువు ఆగిపోయింది. తన స్వంత ఊరికి వచ్చేశాడు.





తన తండ్రికి వ్యవసాయ పనులలో ఏదైనా సహాయం చెయ్యాలేదని అందరూ అనుకొంటున్నా కూడా రోజూ తండ్రితో పాటు పొలానికి వెళ్ళేవాడు. అప్పుడు అతనికి అనిపించింది. నేనూ ఒక విధంగా తన తండ్రికి సహాయం వడాలని, అదీ ట్రాక్టర్ డ్రైవర్‌గా. నిర్ణయించుకోవటం ఏంటి, క్లచ్ బ్రేక్ చేతులతోనే వేస్తూ స్వల్ప కాలంలోనే ట్రాక్టర్ నడపటం నేర్చుకున్నాడు.

మా తండ్రిగారు సాంప్రదాయ వ్యవసాయం చేసేవారు. గోధుమలు, సజ్జలతో పాటు గుజరాత్ ప్రాంతంలో పండించే పంటలు పండించేవాడు. ఆ రోజుల్లో డ్రిప్ పద్ధతి లేదు. నీళ్ళ పారించడమే. దానితో చాలా నీరు వృధా అయ్యేది. నీటి కొరత ఏర్పడేది. పైగా ఈ పద్ధతిలో వ్యవసాయం చెయ్యాలంటే సంవత్సరం పొడవునా కష్టపడాల్సి వచ్చేది. నాకూ వ్యవసాయం చెయ్యాలని అనిపించింది. తనకు అనువైన పంట ఏంటా అని వెతకటం ప్రారంభించాను. నేను చురుగ్గా అందరిలా కదలలేను కనుక దానిని దృష్టిలో ఉంచుకొని ఒక్కసారి పంట వేస్తే దీర్ఘకాలం రాబడి వచ్చే పంట కోసం వెతకటం ప్రారంభించాను.

ఈ క్రమంలో అతని దృష్టి మామిడి పంటపై పడింది. కానీ నిదానంగా ఆలోచించగా వాతావరణంలో ఏ కొద్దిపాటి మార్పు వచ్చినా మామిడి పూత రాలిపోయి ఆ సంవత్సరానికి పంట నష్టపోవాల్సి వస్తుందని గ్రహించాడు. తోటల గురించి ఇంకా వివరాలు తెలుసుకోవాలనే ఆలోచనతో స్థానిక వ్యవసాయాధికారిని కలిశాడు. అదేవిధంగా వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, వ్యవసాయ ప్రదర్శనలు తిరిగాడు. ఈవిధంగా 3 నెలలు గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్రలు మొత్తం తిరిగాడు. చివరికి మహారాష్ట్రలో రైతులు దాదాపు తన గుజరాత్ రాష్ట్రంలో వున్న లాంటి వాతావరణంలోనే దానిమ్మ పంట వేయొచ్చు గమనించాడు. వాకబు చేయగా వాతావరణంలో మార్పుల వలన మామిడిలాగా దానిమ్మ పంటలో పూత రాలి పోవటం ఉండదని తెలుసుకొన్నాడు. పైగా దానిమ్మ వ్యవసాయంలో నిత్యం పర్యవేక్షణ అవసరం లేదని తెలుసుకొన్నాడు.

2004లో గేనాభాయ్ 18,000 దానిమ్మ మొక్కలు తీసుకొని వెళ్ళి సోదరుల సహాయంలో తన పొలంలో నాటాడు. తోటి రైతులు మన గుజరాత్ ప్రాంతంలోనే కాదు, బనస్కాంత జిల్లాలోనే ఎవ్వరూ దానిమ్మ పంట వెయ్యరు, నువ్వెలా వేశావని ఎద్దేవా చేశారు. కానీ తన అంచనా ఎప్పుడూ తప్పు పోదన్న విశ్వాసంతో ఉన్నాడు గేనాభాయ్.

ఈ విషయంలో తన అన్నలు, వారి పిల్లలు తన నిర్ణయాన్ని సమర్ధించి తనకి ధైర్యం చెప్పారు. తనకి చాలా గట్టి నమ్మకం తన పొలంలో తాను వేసిన దానిమ్మ పంట బాగా పెరుగుతుందని.

అతని నమ్మకం 2007లో తన పొలంలో తొలి దానిమ్మ పంట కాపుకొచ్చినప్పుడు దృఢమైంది. అది చూసి ఆ ప్రాంతంలో చాలా మంది రైతులు దానిమ్మ పంట వెయ్యటం ప్రారంభించారు. దానితో దానిమ్మ పళ్ళని అమ్మటం పెద్ద సమస్య అయ్యింది. గుజరాత్ రాష్ట్రంలో దానిమ్మ పండు తినే అలవాటు తక్కువ కాబట్టి ఆ రాష్ట్రంలో దానిమ్మ అమ్మకాలు చాలా తక్కువ.

దానితో గేనాభాయ్ తన తోటి దానిమ్మ రైతులని కూడగట్టుకొని వారి పంటనంతా లారీలలో జైపూర్, ఢిల్లీకి తీసుకొని వెళ్ళి అమ్మటం ప్రారంభించారు. కానీ తమ అమ్మకాల సమస్యకి ఈ లారీలలో తీసుకొని వెళ్ళటం పరిష్కారం కాదని తెలుసుకొని, కొనుగోలు దారులే నేరుగా తమ పొలాల వద్దకి వచ్చి తమ దానిమ్మ పంటను కొనుక్కొని వెళ్ళేలా ఏర్పాటు చెయ్యాలనుకొన్నాడు.

కానీ ఈ విధంగా వ్యాపారులే మా తోటలకి వచ్చి పళ్ళు కొనుక్కొని వెళ్ళాలంటే మావద్ద చాలా భారీ ప్రమాణంలో పళ్ళు ఉన్నాయని వారిని నమ్మించాలి. దీనికొక చిట్కా ప్రయోగించాడు. తమవద్ద నున్న 40 తోటల రైతులతో పట్నాలలో 100 ప్రదేశాల్లో దాన్నిమ పండ్లను అమ్మటం వల్ల వ్యాపారులు వీరివద్ద చాలా తోటలున్నాయని అనుకొని పెద్ద ఆర్డరు ఇచ్చారు. ఈవిధంగా మాకు మొదటి ఆర్డరు వచ్చింది.

మేము కిలో రూ. 42/–కి అమ్మాము. నేను 5 హెక్టార్లలో 54,000 కిలోల దానిమ్మ అమ్మి దాదాపు నా పెట్టుబడి పోను ఈ 10 లక్షలు సంపాదించాను.

సాధారణంగా మామూలు సాంప్రదాయ పంటలు వేసే రైతులు ఎవరికీ 20 వేల నుంచి 25 వేల రూపాయలకు మించి లాభాలు ఆర్జిస్తారు. కానీ నేను 10 లక్షల రూపాయలు ఆర్జించాను.

ఇది చూసి చాలా మంది స్థానిక రైతులు సాంప్రదాయ పంటలు మానేసి పళ్ళు, పూల వ్యవసాయం చెయ్యటం ప్రారంభించారు. గేనా భాయ్ కూడా స్వచ్ఛందంగా దానిమ్మ రైతులకని కార్యశాలలు అవగాహనా సదస్సులు నిర్వహించి, వాటికి శాస్త్రవేత్తలు, పెద్ద వ్యవసాయ దారులని ఆహ్వానించేవాడు. అదేంటి వారంతా నీకు పోటీదారులు కదా అని అడిగితే వ్యవసాయంలో పోటీ ఉండకూడదు పైగా నేను ప్రారంభ దశలో చేసిన పొరపాట్లు తప్పులూ వారు చెయ్యకూడదు అందుకే ఈ సమావేశాలు అంటుండేవాడు.

దీనితో సమస్య తీరిపోలేదు. ఒక సమయంలో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి కొరత ఏర్పడింది. ప్రతి దానికీ ఒక కారణం ఉంటుందని ప్రగాఢంగా నమ్మే గేనాభాయ్ బిందు సేద్యం



ప్రారంభించాడు. దానికై ఏర్పాటు చేశాడు.

బిందు సేద్యానికి ప్రారంభంలో 50% సబ్సిడీ ఉండేది. కానీ ఇప్పుడు 80% వరకు పెరిగింది. ప్రభుత్వం ఇప్పుడు 42,000 సబ్సిడీ ఇస్తోంది. దానిని ఆసరాగా తీసుకొని దానిమ్మ రైతులందరు తమ తోటలలో డ్రిప్ పద్ధతి ఏర్పాటు చేసుకొన్నారు.

ఇప్పుడు గేనాభాయ్ కృషి ఫలించి వారి జిల్లాలోని దానిమ్మ పండ్లు దుబాయ్, బంగ్లాదేశ్, శ్రీలంకలలో కూడా విక్రయించి, రైతులు మంచి లాభాలు పొందుతున్నారు. వారి తాలూకాకి వచ్చిన మన ప్రధాని మోడీ గారు గేనాభాయ్ పేరు చెప్పి వారు దానిమ్మ రైతులకు చేసిన మేలు గురించి ప్రస్తావించారు.

రైతులు తాము పడే కష్టాల నుంచి ఎలా బైట పడాలని అడిగినప్పుడు ఆయన రైతులు కేవలం సాంప్రదాయ పంటలు, పద్ధతుల గురించి కాక కొత్తరకంగా ఆలోచించటం నేర్చుకోవాలి. ప్రతి రైతువద్ద కనీసం రెండు దేశీ ఆవులుండాలి, తానే తనకు కావలసిన సేంద్రియ పద్ధతులలో, క్రిమి సంహార మందులు, ఎరువులు తయారు చేసుకోవాలి. అనవసరంగా రసాయనిక ఎరువులపై డబ్బు తగలెయ్యకూడదు. అది ఆర్థికంగా, ఆరోగ్య పరంగా కూడా మంచిది కాదు. ఏ రకమైన పంటలకి డిమాండు ఉందో చూసుకొని ఆ రకమైన పంటలు వేస్తే అమ్ముకోవటం





సులభమవుతుంది. వీలుంటే ఎగుమతులు కూడా చేసుకొని అలా కూడా ఎక్కువ ఆదాయం పొందవచ్చు. విదేశీ మారకం ఆర్జిస్తే మనకి దేశానికి కూడా మేలు చేసిన వాళ్ళమవుతాము అంటారాయన.

రైతుల ఆదాయం పెరిగితే అదేంటో ఇంగ్లీషులో అన్నట్లు రైతులు కూడా కాలరెత్తుకుని జీవిస్తారు అంటారాయన నవ్వుతూ. గేనాభాయ్‌కి 18 రాష్ట్రస్థాయి పురస్కారాలు, ఇంకా అనేక జాతీయ స్థాయుయి గుర్తింపులతో సత్కారం జరిగింది. కానీ నాకు పద్మశ్రీ వస్తుందని కలలో కూడా అనుకోలేదు అంటాడాయన. మన పూర్వ రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ గారి హస్తాలతో 'పద్మశ్రీ' పురస్కారం అందుకుంటుంటే నేను స్వర్గంలో ఉన్నట్లు అనిపించింది అంటారాయన.

మీ భవిష్యత్తు ఆలోచనలు ఏమిటని అడిగినప్పుడు "మన భారత దేశంలో రైతులు కష్టపడకుండా ఉండాలని, భారత దేశంలో గొప్ప రైతులు కూడా ఉంటారని ఎవరైనా అంటే దానికి ఆశ్చర్యపోకుండా, ఇది భారత దేశం, ఇక్కడా గొప్ప రైతులు ఉంటారు అని చెప్పుకునే స్థాయికి మన దేశం ఎదగాలని కోరుకుంటున్నాను" అన్నారాయన. 'పల్లెసృజన' గేనాభాయ్‌కి శుభాకాంక్షలు అందజేస్తోంది.●




## మహిపాల్ ఇన్నోవేటివ్ షాప్ బోర్డు

ఆలోచనలు ఇన్నోవేటివ్‌గానే ఉంటాయి అనటానికి నిదర్శనం ఇక్కడ కనిపిస్తున్న షాపు యొక్క బోర్డు. హన్మకొండ జిల్లా 'పర్కాల' కు చెందిన, 'పల్లెసృజన' పాఠకులకు చిరపరిచితుడైన "కడివెండి మహిపాల్ చారి" తన వర్క్‌షాప్ యొక్క బోర్డును ఇన్నోవేటివ్‌గా తయారు చేశాడు. సాధారణంగా ప్రతిచోట "ఇంజనీరింగ్ వర్క్స్' అని బోర్డు ఉంటుంది. కానీ, ఇంజనీరింగ్ కు సంబంధించిన ఎన్నో రకాల పనులు అక్కడ జరుగుతూ ఉంటాయి. ఈ షాపు ఏ ఇంజనీరింగ్ విభాగానికి తెలుసుకోవాలంటే షాపులోకి వెళ్ళి చూస్తే కానీ తెలియదు వారు చేస్తున్న పనులు. కానీ మహిపాల్ చారి తన బోర్డుకు పైన తాను తయారు చేసే 'మహిపాల్ వీడర్'నే నేరుగా పైకి ఎత్తి బోర్డుపైన పెట్టడంతో ఆ దారిన వెళ్ళే ప్రతి ఒక్కరికీ తెలిసిపోతుంది ఈ షాపులో ఇలాంటి వీడర్లు తయారౌతాయి అని. కాబట్టి ఇతర పనులు చేయించుకోవాలి అనుకున్న వారు అటువైపు రారు. వీడర్లు కావలసిన వారు బోర్డుపైన ఉన్న వీడర్‌ను చూసి నేరుగా వెళ్ళి తమకు కావలసిన వీడర్‌ను కొనుగోలు చేస్తారు.

కొందరు మాత్రం అంత ఎత్తు బోర్డుపైకి ఈ వీడర్‌ను పెద్ద క్రేన్ సహాయంతో ఎత్తి ఉంటారు అని అనుకుంటారు. కానీ, ఆ వీడర్‌ను బోర్డు పైన పెట్టడానికి కూడా తాను తయారు చేసిన ట్రాక్టర్ క్రేన్‌తోనే అంత ఎత్తుకు వీడర్‌ను లేపి అక్కడ పెట్టాడు అని తెలుసుకుని అతని ఆలోచనకు 'హాట్స్ ఆఫ్' అని చెప్పడమే కాక, తమ తమ ప్రాంతాలలో, సన్నిహితులతో మహిపాల్ యొక్క ఇన్నోవేటివ్ యంత్రాలు, పరికరాలు, అతని పనితనం గురించి చెప్పటం వల్ల మహిపాల్ చారికి అదనపు అడ్వర్‌టైజింగ్ కూడా లభిస్తోంది.



వరిలో కలుపుకు ప్రపంచంలోనే మొదటి సారిగా మూలికలతో చేసిన

# వరిలో కలుపు నివారణ కషాయం

## 'గల్లా చంద్రశేఖర్' మరో ఇన్నోవేషన్

- జమ్మలమడక శశిమోహన్

"గల్లా చంద్రేశేఖర్" పేరు 'పల్లెసృజన' పాఠకులకు సుపరిచితం. తిరుపతి జిల్లా, కారాకొల్లు గ్రామానికి చెందిన ఇతను చిన్నప్పటి నుంచి కూడా ప్రజలకు ఉపయోగ పడే ఆలోచనలు చేయటం, వీలైతే వారి సమస్యలకి పరిష్కారాలు చూపటం లాంటివి చేస్తూ ఉండే వాడు. ఈయన తన మిత్ర బృందమైన 'బత్తి నాయుడు, భాస్కర్, మురళి, శ్రీధర్, శివ, వెంకటేశ్వర్లు'లతో కలిసి సమిష్టిగా మొదట మొక్కలపై ఎన్నో రకాల ప్రయోగాలు చేసి రకరకాల ద్రావకాలను, కషాయాలను తయారు చేసేవాడు. ఈయన మౌళికంగా వ్యవసాయం, సస్యరక్షణ మీద దృష్టి కేంద్రీకరించాడు. ఈ క్రమంలోనే ఒకసారి ఆయన చేసిన ద్రావకం ఒకటి  దోమలను తరిమికొట్టే మందును తయారు చేశారు. అలా తయారైన మందే పాఠకులకు తెలిసిన 'శ్రీతైలం'. దీన్ని శరీరంపైన పూసుకుంటే దోమలు కుట్టవు. శ్రీతైలం తయారు చేసినందుకు గాను 2013లో గల్లా చంద్రశేఖర్‌కు ఎన్ఐఎఫ్ వారి జాతీయ ద్వైవార్షిక పోటీలలో 'రాష్ట్రపతి పురస్కారం' కూడా లభించింది. ఇది కేవలం దోమల నుండి రక్షణ ఇవ్వడమే కాక, గాయాలకు, కాలిన గాయాలకు, అనేక చర్మ వ్యాధులకు అమోఘంగా పని చేస్తుంది. దీర్ఘకాలికంగా వున్న వొళ్ళు నొప్పులు, కీళ్ళ నొప్పులను కూడా నివారిస్తుంది. లక్షలాది మంది ప్రజలు 'శ్రీతైలం' వాడి నొప్పులు, గాయాల నుండి నివారణ పొందుతున్నారు.

మధుమేహ వ్యాధితో ఒక రోగికి కాలు తీసివేయ వలసిన పరిస్థితుల్లో ఈ శ్రీతైలం వాడటం వలన క్రమేపీ గాయం మానిపోయి, ఆపరేషన్ చేసి కాలు తీసివేయ వలసిన పరిస్థితి తప్పిపోయింది. ఆస్పత్రులలో ఆపరేషన్ చేసి, కుట్లు వేసిన తర్వాత కొందరు ఈ శ్రీతైలం గురించి తెలిసిన డాక్టర్లు కుట్లు త్వరగా మానటానికి దీన్నే వాడుతున్నట్లు ఒప్పుకున్నారు.

గ్రామాల్లో వ్యవసాయమే ప్రధాన వృత్తి కాబట్టి గ్రామీణ నేపథ్యం కలిగిన ఈ బృందం రైతుల సమస్యలపై దృష్టి సారించి మరిన్ని ప్రయోగాలు చేయటం ఆరంభిం చారు. రైతుల ప్రధాన సమస్య పంట పొలాల్లో 'కలుపు' అన్న ఉద్దేశ్యంతో ఆ దిశగా వీరి ప్రయోగాలు మొదలు కొనసాగించారు. కలుపు వల్ల దాదాపు 30 శాతం వరకు పంట నష్టం జరుగుతుంది. దాన్ని నిర్మూలించకుండా అశ్రద్ధ చేస్తే పంట మొత్తం కూడా నష్టపోయే ప్రమాదముంది. కాబట్టి రైతులు కలుపు నివారించేందుకు మనుషులను పెట్టి తీయిస్తుంటారు. కానీ ఇప్పుడు కూలీల కొరత, ఖర్చు తీవ్రంగా వేధిస్తోంది రైతులను. గతిలేని పరిస్థితుల్లో వీటిని భరించలేక రసాయన మందులు చల్లుతున్నారు. ఇలా చేయటం వల్ల



కొంత వరకు కలుపు సమస్య తీరుతోంది కానీ, భూసారం దెబ్బతిని, పంటలకు మేలు చేసే వానపాములు, ఇతర మిత్ర పురుగులు నశించిపోతున్నాయి. కలుపు మందును ప్రపంచ వ్యాప్తంగా నిషేధించినప్పటికీ మన మార్కెట్లో విరివిగా లభిస్తునే ఉంది. ఈ విషయం కొందరు రైతులకు తెలిసినా వేరు మార్గం లేని పరిస్థితుల్లో రైతులు ఇంకా వాటిని వాడుతునే ఉన్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో కలుపు నిర్మూలనకు మొక్కల నుండి తీసిన రసం వాడితే ఎలా ఉంటుందని ఆలోచించి అలాంటి మొక్కలు ప్రకృతిలో ఏమైనా ఉన్నాయా? అని వెతకటం మొదలు పెట్టారు. అలా కొన్ని మొక్కలను సేకరించి, వాటిపై ప్రయోగాలు చేసి మొత్తానికి "వీడ్ జాప్" అనే కలుపు మందును తయారు చేసింది చంద్రశేఖర్ మిత్ర బృందం. మందు తయారైన తర్వాత క్షేత్ర స్థాయిలో ఎన్నో ప్రయోగాలు చేసి, ఎందరో రైతులకి ఈ మందును ఇచ్చి, ప్రయోగాత్మకంగా వాడమని చెప్పారు. వారంతా అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది అని చెప్పిన తర్వాత, మరికొన్ని ప్రయోగాలు చేసి, మందు పనితీరు తమకు సంతృప్తిని ఇచ్చిన తర్వాత దీన్ని మార్కెట్ లోకి విడుదల చేశారు. ప్రస్తుతం ఎంతోమంది రైతులు ఈ మందును వినియోగించి తమ వరి పొలాల్లో కలుపును నివారించుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కలుపు నివారణకై ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా, కేవలం సేంద్రియ పద్ధతిలో తయారైన మందు బహుశా ఇదేనేమో. ఈ మందు వాడిన తర్వాత పంటకు కాని, మిత్ర పురుగులకు కాని ఎటువంటి హాని జరగటం లేదని నిరూపించబడింది.





ఈ వీడ్ జాప్ మందును ప్రస్తుతం వరి పంటలో మాత్రమే వాడుతున్నారు. ఈ మందును వరి నాటు వేసే ముందు చివరి దమ్ములో ఎకరాకు 3 లీటర్ల చొప్పున మందును ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లిన తర్వాత వరి నాటు వేసుకోవాలి. ఆ తర్వాత పది రోజుల వరకు ఆ వరి పొలం నుండి నీరు బయటికి పోకుండా చూసుకోవాలి. దీనివల్ల కలుపు సమస్య తగ్గడమే కాక, ఇదే మందు తర్వాత పంటకు బలం కూడా చేకూర్చే మందుగా మారుతుంది. ఈ మందు ప్రయోగించటం వల్ల గింజ నాణ్యత, పరిమాణం పెరిగి దిగుబడి కూడా కొద్దిగా పెరిగిందని రైతులు వెల్లడించారు.

'వీడ్ జాప్' అనే పురుగు మందును ఉపయోగించడం వల్ల రైతుకు కలుపు నివారణకు అయ్యే ఖర్చు ఆదా కావటంతో పాటు ఎరువుల వినియోగం కూడా దాదాపు 50 శాతం వరకు మిగులుతుంది. పంట దిగుబడి, నాణ్యత కూడా పెరగటం ఈ మూలికా పురుగు మందు ప్రత్యేకత.

దేశంలో కోట్లాది మంది రైతులు మూలికా ముందు 'వీడ్ జాప్'ను వాడి, వారి పంటల దిగుబడిని పెంచుకోవాలని, వారి భూముల్లో రసాయనాలు ఉపయోగించకుండా భూమిని కాపాడుకోవాలి అని 'పల్లెసృజన' ఆశిస్తున్నది. గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్ చంద్రశేఖర్ వారి మిత్రులు ఆవిష్కరించిన ఈ కలుపు మందు అతి త్వరలో దేశమంతా ప్రాచుర్యం పొంది, రైతులందరికీ అందుబాటులో ఉంటుందని ఆశిస్తున్నాం.

చంద్రశేఖర్ గారు సస్యరక్షణలో ఇంకెన్నో మూలికా ప్రయోగాలు చేసి రైతుల ఆర్థికాభివృద్ధికి దోహద పడాలని 'పల్లెసృజన' మనస్ఫూర్తిగా కోరుకుంటోంది.

**ఇన్నోవేటర్ చంద్రశేఖర్ ఫోన్ నెం. 98495 41674**

## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలి అన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 400/–లతో 2సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని 30 వేల గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని, సామాన్య ప్రజల మధ్య సమానాంతర సంభాషణలు ప్రారంభమై, వారిని మరింత ప్రభావితం చేస్తాయని 'పల్లెసృజన' మనసారా ఆశిస్తోంది. -ఎడిటర్

**పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి - 'పల్లెసృజన'ను బహూకరించండి!** **మీ గ్రామానికి మీరిచ్చే అత్యుత్తమ బహుమతి 'పల్లెసృజన'**

సందర్భం ఏదైనా ఆచారం, సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇస్తూ వుంటారు. దానికెంత ఖర్చు చేయాలి? అసలు బహుమతి ఏమివ్వాలి? అన్నవి ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు.

❀ ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా, అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా, జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేది, పెంచేదిగా ఉండాలంటే?

బహుమతి ఇచ్చిన వారికే కాక, తీసుకున్న వారితో పాటు, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. 'పల్లెసృజన' పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగివున్న విజ్ఞాన సంపదను వెలికి తీసి, ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటు పడుతుంది.

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## వేసవి కాలంలో ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, చిట్కాలు


ఉమా మహేశ్వర రావు

**ఎండాకాలంలో ఆరోగ్య సమస్యల నివారణకు చిట్కాలు:**

ప్రస్తుతం ఎండలు బాగా ముదురుతున్నాయి కాబట్టి అందరూ వీలైనంత వరకు ఉదయం 10-11 గంటల లోపు పనులన్నీ ముగించుకుని ఇల్లు లేదా పని చేసే కార్యాలయం చేరుకుంటే మంచిది. 11 గంటల తర్వాత బయటకు వెళ్ళాల్సిన తప్పనిసరి పరిస్థితి వస్తే తలకు తలపాగా లేదా టోపీ పెట్టుకొని వెళ్ళటం మంచిది. బయటకు వెళ్ళేటప్పుడు పలుచటి మజ్జిగ సీసా ఒకటి వెంట తీసుకు వెళ్ళి అప్పుడప్పుడూ ఒక్కో గుక్క తాగుతూ ఉంటే ఎండ దెబ్బ నుంచి చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. ఉదయం బయటకు వెళ్ళేటపుడు 'ఉల్లిపాయ' రసం చేసుకుని ఒక్క చెంచాడు ఉల్లి రసం తాగి వెళ్ళినట్లయితే కూడా ఎండ దెబ్బ తగలకుండా నివారించుకోవచ్చు.

వడదెబ్బ తగిలిన వాళ్ళకు ఉల్లిపాయ రసం అప్పుడప్పుడూ ఒక చెంచాడు తాగిస్తూ, శరీరం మొత్తం మెత్తటి గుడ్డను నీటిలో అద్ది శరీరంపైన తడువుతూ ఉన్నట్లయితే వడదెబ్బ నుంచి త్వరగా ఉపశమనం పొందవచ్చు. ఉల్లిపాయ రసం తాగటమే కాకుండా అప్పుడప్పుడూ ఉల్లిపాయ వాసన చూసుకుంటూ ఉన్నా కూడా ఎండ దెబ్బ తగలకుండా చూసుకోవచ్చు.

ఉప్పు, పంచదార, నిమ్మ రసాలను మజ్జిగలో లేదా నీళ్ళల్లో కలిపి ఉంచుకుని అప్పుడప్పుడూ గొంతు తడుపుకుంటూ ఉండటం మంచిది. ఇలా చేయటం వల్ల ఎండల వల్ల మనిషి త్వరగా నీరసించి పోవటం, వడదెబ్బల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఎండల వల్ల శరీరంలో నీటి శాతం తగ్గి, శరీరానికి అందవలసిన లవణాలు అందకుండా అలసిపోవటం జరుగుతూ ఉంటుంది. ఈ పానీయం స్వీకరించటం వల్ల ఈ సమస్యల నుండి దూరంగా ఉండవచ్చు. డాక్టర్లు ఈ సమస్య నుండి బైట పడాలంటే 'ఎలక్ట్రోరల్ పౌడర్' నీటిలో కలుపుకుని అప్పుడప్పుడూ సేవిస్తూ ఉండమని సలహా ఇస్తుంటారు. ఎలక్ట్రోరల్ పౌడర్ అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండదు కనుక పైన చెప్పిన విధంగా చేసుకున్నట్లయితే ఈ పానీయం కూడా ఎలక్ట్రోరల్ పౌడర్‌లా పని చేస్తుంది.

ఎండా కాలం శరీరంలో నీటి శాతం తగ్గటం వల్ల కిడ్నీలలో రాళ్ళు ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. 'మొలలు' (పైల్స్) వచ్చే అవకాశం కూడా ఉంటుంది. కాబట్టి బయటకు వెళ్ళాల్సిన పరిస్థితి తప్పనిసరైతే వేసవిలో పుచ్చకాయలు, కీర దోసకాయలను ఎక్కువగా తింటూ ఉండటం వల్ల వాటిల్లో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి చాలా సమస్యల నుండి నివారణ పొందవచ్చు. కిడ్నీలో రాళ్ళు ఉన్నవాళ్ళు కీర దోసకాయను తోలుతో సహా చిన్న చిన్న ముక్కలుగా చేసుకుని, నీటిలో వేసి బాగా ఉడికించి, చల్లారిన తర్వాత వడకట్టి రోజుకు రెండు మూడు సార్లు ఆ నీటిని సేవించినట్లయితే కిడ్నీలో ఏర్పడ్డ ఎంతటి రాయి అయినా సరే ముక్కలు ముక్కలుగా మారి మల మూత్రాల ద్వారా బయటకు వెళుతుంది.

శరీరంలో నీటి శాతం తగ్గటం వల్ల మొలలు కూడా చాలా మందిని బాధిస్తూ ఉంటాయి. ఇటువంటి వారికి మలం గట్టిగా రావటం వల్ల మల ద్వారం వద్ద ఎక్కువ బాధ పెడుతూ ఉంటుంది. అటువంటి వారు వంకాయల పైన వున్న కాడలను తీసుకుని, రోట్లో వేసి బాగా మెత్తగా పేస్టు తయారయ్యేలాగా నూరి, మల ద్వారం వద్ద పెట్టి ఒక పలుచటి బట్ట కట్టుకున్నట్లయితే మొలల వల్ల కలిగే బాధ నుండి ఉపశమనం పొందవచ్చు. ఇలా రోజుకు ఒసారి చొప్పున మూడు లేదా నాలుగు రోజులు చేయ గలిగితే ఆ బాధ నుండి విముక్తి పొందవచ్చు. ఒకవేళ వంకాయ కాడలు సేకరించి, నూరుకోవటం కుదరని వాళ్ళు 'గోరింటాకు' మెత్తగా నూరి కట్టుకున్నా కూడా అదే ఫలితాన్ని పొందవచ్చు.

**శరీరంలోని సర్వరోగ నివారణకు కషాయం:**

వేసవిలోనే ఎప్పుడైనా సరే శరీరంలో మనకు కనిపించని, గుర్తించలేని అసహనంగా ఉండే రోగాలన్నిటిని నివారించటానికి ఈ కషాయం చేసుకుని సేవిస్తే ఇది సర్వరోగ నివారణిగా పని చేస్తుంది. ఈ కషాయం పేరు 'అమృత నిర్గుండి'. ఈ కషాయం చేసుకోవటానికి 'నేల వేము, కురుమ తీగ, పొడపత్రి ఆకు, తెల్లమద్ది, పారిజాతం, అడ్డసరం, వేప, వావిలి, మారేడు, వాకుడు' వీటన్నిని ఆయుర్వేద ఔషధ దుకాణాల్లో 100 గ్రాముల చొప్పున తెచ్చుకుని, వీటన్నిని కలిపి మెత్తటి పొడిగా చేసుకుని, ఒక డబ్బాలో పోసుకుని, రోజూ ఒక చెంచాడు పొడిని ఒక గ్లాసు నీటిలో వేసుకుని, అవి సగం అయ్యే దాకా మరిగించి, కషాయం చేసుకుని పెద్దవాళ్ళయితే ఒక గ్లాసు, చిన్నవాళ్ళయితే అర గ్లాసు, మరీ చిన్న పిల్లలయితే పావు గ్లాసు కషాయం రోజుకు ఒక్కసారి తీసుకున్నట్లయితే "జలుబు, దగ్గు, తుమ్ములు, ఆయాసం, వేడి చేయటం, ఒళ్ళు మంటలు, దురదలు, కొందరికి ఎండాకాలం రాగానే శరీరం పేలుతూ ఉంటుంది ఇలా అన్ని రోగాలను నివారించే సర్వరోగ నివారణ ఈ 'అమృత నిర్గుండి' కషాయం.

ప్రతి దానికి డాక్టరు, మాత్రలు అనుకోకుండా ప్రకృతి మనకు ప్రసాదించిన ఈ మూలికలతో పైన చెప్పిన కషాయం తీసుకుంటూ ఉన్నట్లయితే సర్వరోగ నివారణ కలిగించుకుంటూ, మనిషి ఆరోగ్యంగా, డాక్టర్లు, మాత్రల జోలికి వెళ్ళకుండా జీవించవచ్చు. మాత్రలు, మందుల వల్ల కొందరికి సైడ్ ఎఫెక్ట్ వల్ల మరో కొత్త రోగం కూడా వచ్చే అవకాశాలుంటాయి. కానీ, ఈ ప్రకృతి ప్రసాదించిన మందుల వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవు.

**గమనిక:** ఈ శీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854**


## చిన్న పిల్లల్లో వచ్చే ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేద చిట్కాలు :

వేసవి కాలం మొదలైంది. చిన్న పిల్లల్లో 'నోటి పూత' ఈ కాలంలో ఎక్కువగా వచ్చే అవకాశాలుంటాయి. ఈ సమస్యకి రావిచెట్టు బెరడు, రావిచెట్టు చిగురుటాకులు మూడు తీసుకుని బెరడు, ఆకులను రోట్లో వేసి మెత్తగా నూరాలి. అవసరమైతే కొద్దిగా నీళ్ళు పోసుకోవచ్చు. అలా నూరితే పేస్టులాగా తయారవుతుంది. ఆ పేస్టును తీసుకుని పిల్లలకు నోటి పూత వచ్చిన చోట (నాలుకపై), దవడల పైన పూయాలి. అలా చేసినట్లయితే నోటిపూత త్వరగా తగ్గిపోతుంది.

కొంతమంది చిన్నారులకు ఈ వేసవి కాలంలో విరోచనాలు బాగా అవుతూ ఉంటాయి. ఈ సమస్య ఎదురైనపుడు మారేడు కాయ లోపలి గుజ్జు 2 గ్రాముల మోతాదు తీసుకుని నీటిలో కలిపి చిన్నారికి తాగిస్తే చాలు విరేచనాల నుండి ఉపశమనం పొందవచ్చు.

చాలా మంది పిల్లలకు రాత్రి సమయంలో మూత్ర విసర్జన వల్ల పరుపులు తడుపుతూ ఉంటారు. దీనివల్ల చాలామంది తల్లులు ఇబ్బంది పడుతూ ఉంటారు. పరుపులన్నీ ఉచ్చ కంపు కొడుతున్నాయని బాధ పడుతూ ఉంటారు. కొందరు పిల్లలు 8–9 ఏళ్ళ వయస్సు వచ్చినా సరే రాత్రిపూట మూత్రం పోస్తూనే ఉంటారు. ఈ సమస్య నివారణకు సంపంగి చెట్టు బెరడు అర గుప్పెడు తీసుకుని రోట్లో వేసి కాస్త కచ కచా (కొద్దిగా ముక్కలు అయిపోయేలా) దంచి, ఆ బెరడును ఒక గ్లాసు నీటిలో వేయాలి. ఆ నీటిని పొయ్యిపైన పెట్టి, ఆ నీరు అరగ్లాసు అయ్యేదాకా వేడి చెయ్యాలి. ఆ తర్వాత వాటిని వడకట్టి, చిన్నారుల చేత అప్పుడప్పుడూ ఒక్కో గుటిక కషాయాన్ని తాగిస్తే త్వరలోనే రాత్రి వేళల్లో మూత్ర విసర్జన మానుకుంటారు.

ఈ వేసవిలో కొంతమందికి శరీరంపై గడ్డలు ఏర్పడుతూ ఉంటాయి. వీటిని ఒక్కో ప్రాంతంలో 'ఉడుకు గడ్డలు' అని, 'వేడి గడ్డలు' అని అంటూ ఉంటారు. ఈ గడ్డలు త్వరగా పాకానికి రావు. అంటే పుండు మాగింది కాబట్టి ఇక దీన్ని గట్టిగా వత్తితే అది పగిలిపోయి మానిపోతుంది అనే అవకాశం ఉండదు. అటువంటి గడ్డలు అయినప్పుడు 'నల్ల తుమ్మచెట్టు బెరడు' తీసుకుని రోట్లో వేసి మెత్తటి పొడిగా దంచుకుని, అందులో కొద్దిగా నీటి చుక్కలు వేసి పేస్టులా తయారు చేసి, ఆ గడ్డలపైన లేపనం గా పూసినట్లయితే రెండు మూడు రోజుల్లోనే ఆ గడ్డలు వాటంతట అవే కరిగి పోవటం లేదా గడ్డ పెద్దదిగా ఉన్నట్లయితే అది పాకానికి వస్తుంది, అప్పుడు దాన్ని చేతితో వత్తి అందులోని చీము లాంటి పదార్థం మొత్తం బయటికి పొయ్యేలా చేస్తే ఆ పుండు కూడా త్వరలోనే మానిపోతుంది. ఒకవేళ పుండు అయితే ఆ పుండు మానేంత వరకు ఈ నల్లతుమ్మ చెట్టు బెరడు పేస్టును గాయంపైన పూస్తూ ఉండాలి.




కొందరు వ్యక్తులకు ఈ వేసవి కాలంలో ముఖంపైన గుల్లలు, మొటిమలు ఏర్పడుతూ ఉంటాయి. ఇలా ఏవైనా సరే ఇంట్లో బియ్యం కడిగిన నీళ్లు ఒక అర గ్లాసు తీసుకుని, అందులో మరొక అర గ్లాసు ఆవు పాలు కలిపి బాగా కలియతిప్పి, ఆ మిశ్రమాన్ని ముఖంపైన మెత్తటి దూదితో పూయాలి. ఇలా చేసిన తర్వాత ఒక అరగంట పాటు ఆరనిచ్చి, ఆ తర్వాత ముఖాన్ని సబ్బు కడుక్కుంటూ ఉండాలి. ఇలా 5–6 రోజులు చేసినట్లయితే ముఖంపైన ఏర్పడే చెడు గుల్లలు, మొటిమలు లాంటివన్నీ పోయి, ముఖ వర్ఛస్సు కూడా బాగా తయారవుతుంది.



- 'వైద్య' కొమెర జాజి

## బొల్లి వ్యాధికి ఆయుర్వేద ఔషధం:

బొల్లి వ్యాధి అనేది చాలా దీర్ఘరోగం. చాలామంది దీనికి మందులు లేవు అనుకుంటూ ఉంటారు. ఈ రోగ నివారణకు 'బావంచాలతో తీసిన నూనె' తీసుకుని బొల్లి వ్యాధి ఉన్నచోటల్లా శరీరంపైన అప్పుడప్పుడూ పూస్తూ ఉండాలి.

రాత్రి సమయంలో వేప చెట్టు చిగురు ఆకులను తీసుకుని, మజ్జిగలో వేసి మెత్తగా నూరి, బొల్లి వ్యాధి ఉన్నచోట శరీరంపైన పూసి, ఉదయమే స్నానం చేస్తూ ఉండాలి.

'షంద్ర చెక్క' అనే ఔషధం ఆయుర్వేద మూలికలు అమ్మే దుకాణాల్లో లభిస్తుంది. ఆ చెక్కను బాగా దంచి ఒక పెద్ద పాత్రలో నీరు తీసుకుని ఆ నీటిలో నానబెట్టాలి. బాగా నానిన తర్వాత నీటిపైన ఊటలాగా ఏర్పడుతుంది. ఆ ఊటను ఉపయోగించి, అన్నం వండుకుని తినాలి. అంటే బియ్యంలో నీళ్ళు కాకుండా ఈ ఊటతోనే అన్నం వండాలి. అలాగే ఆ ఊటను ఒక అరగ్లాసు తీసుకుని తాగుతూ ఉండాలి.

పైన చెప్పిన మూడు రకాల వైద్యాలను చేస్తూ ఉన్నట్లయితే బొల్లి వ్యాధి నుండి త్వరగా ఉపశమనం పొందవచ్చు.

## వేసవిలో చెమటలు, శరీరం నుండి వచ్చే దుర్వాసన నివారణకు:

వేసవి కాలంలో చాలా మందికి చెమట వల్ల శరీరం నుండి దుర్వాసన వస్తూ ఉంటుంది. ఒక్కోసారి ఈ దుర్వాసన పక్కనున్న వాళ్ళే కాదు, తమకు తామే చాలా అసహనానికి లోనవుతూ ఉంటారు. ఇలాంటి వారు రెండు పద్ధతుల్లో స్నానం చేస్తూ ఉంటే మంచిది.

మొదటిది ఒక బకెట్ నీళ్ళలో 'సరస్వతి ఆకు'లను వేసి, అవి రెండు మూడు గంటలు నానిన తర్వాత ఆ నీటితో స్నానం చెయ్యాలి. ఇక రెండో పద్ధతి బకెట్ నీటిలో 'మారేడు' ఆకులు, లేత వేప ఆకులు, తులసి ఆకులను ఒక్కోటి మూడు గుప్పెళ్ళు తీసుకుని, పచ్చ కర్పూరం బిల్ల ఒకటి తీసుకుని దంచి, పైన చెప్పిన ఆకులతో పాటు బకెట నీళ్ళలో వెయ్యాలి. ఆ తర్వాత కొద్దిగా నిమ్మరసం, చిటికెడు పసుపు, చిటికెడు జాపత్రి కూడా అందులో కలపాలి. ఆ నీటిని ఒక రెండు గంటల పాటు అలా ఉంచాలి. ఆ తర్వాత బకెట లోని ఆకులన్నిటిని తీసివేసి, ఆ నీటితో తల స్నానం చేస్తూ ఉన్నట్లయితే అతి త్వరలోనే శరీరం నుండి వచ్చే దుర్వాసన ఆగిపోవటంతో పాటు శరీరానికి సంబంధించిన చాలా వరకు చర్మ రోగాలు కూడా నయం అవుతాయి.

●

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700**

**'కుప్పింటాకు'తో ఆయుర్వేద చిట్కాలు :**

'కుప్పింటాకు' మనం నివసించే పరిసర ప్రాంతాలలో చుట్టు ప్రక్కల మన ఇండ్ల చుట్టూ ఎక్కడ పడితే అక్కడ విరివిగా లభిస్తుంది. ఇది ఒక అడుగు ఎత్తు వరకు పెరుగుతుంది. ఎండాకాలంలో కొద్దిగా తక్కువగాను, మిగతా కాలాల్లో ఎక్కువ చెట్లు లభిస్తాయి. దీనిని వివిధ ప్రాంతాలలో కుప్పింట, పిప్పింట, మూర్కొండాకు, పిచ్చాకు అని పిలుస్తుంటారు. ఇది మానవ జీవితంలో అనేక వ్యాధులకి ఔషధంలా పని చేస్తుంది. ఇది అన్ని చోట్లా విరివిగా లభించే మొక్క, ఎన్నో గొప్ప ఔషధ గుణాలు కలిగిన మొక్క. చాలా మంది ఇదేదో పిచ్చిమొక్క అనుకుంటారు కానీ, ఇందులో దాగివున్న ఔషధ గుణాలు తెలుసుకొన్న వారు తమ ఇళ్ళల్లో కుండీల్లో వేసుకుని పెంచుకుంటూ ఉంటారు. మిద్దె తోటలు పెంచుకునే వారు తమ తోటలో తప్పనిసరిగా పెంచుకోవలసిన ఔషధ మొక్కల్లో ఇది కూడా ఒకటి. చాలా రకాల చిన్న చిన్న రోగాలకు కూడా మాత్రలు, డాక్టర్ల వద్దకు వెళ్ళకుండా ఇంట్లోనే వైద్యం చేసుకుని రోగ విముక్తులు కావచ్చు.





బాల నర్సయ్య, నల్గొండ జిల్లా

దీనియొక్క ఆకులు సేకరించి, దంచి, రసం తీసి 4 చుక్కల చొప్పున ఉదయం పూట రెండు ముక్కులలో వేసుకుంటే ముక్కులో కలిగే వ్యాధులు, ఊపిరి తిత్తుల్లో కలిగే వ్యాధులు తగ్గుతాయి. ముక్కు నుండి నీరు కారటం, ముక్కులో కండలు పెరగడం, ముక్కు దిబ్బట వేయడం తగ్గుతాయి. దీని రసం 100 మి.లీ. సేకరించి, దానిలో చిటికెడు సున్నం (తేట సున్నం) కలిపి పొద్దున పూట రొమ్ము భాగంలో వెనక ముందు పూతగా వాడటం వలన శ్వాసకోశ అవయవాలలో కలిగే నొప్పులు (ఊపిరి కుట్టు వ్యాధి)ని తగ్గిస్తుంది.

ఒక 30 మి.లీ. పసరును 100 మి.లీ. పాలలో కలిపి ఉదయంపూట పరగడుపున త్రాగి, చప్పిడి పథ్యం చేయిస్తే పసిరికలు (పచ్చ కామెర్లు) 3 రోజుల్లో తగ్గుతాయి.

ఈ కుప్పింటాకును 2 ఆకులు ముద్దగా నలిపి పన్నుకు పెట్టిన యెడల పన్ను నొప్పి బాధ తగ్గుతుంది. అలా 3 రోజుల పాటు చేసిన యెడల వాపు, నొప్పి తగ్గుతాయి. కుప్పింటాకు, అత్తిపత్తి, నెమలినార ఆకు సమానంగా సేకరించి, వాటిని స్టీలు పాత్రలో వేసి అవి మునిగేటట్లుగా స్వచ్ఛమైన కొబ్బరి నూనె పోసి, పొయ్యిపైన పెట్టి మరిగించి, ఆకులు మాడుతున్న సమయంలో పొయ్యిమీద నుంచి దించి, ఆ నూనె చల్లారిన తర్వాత వడకట్టి నిలువ చేసుకుని పై పూతగా శరీర మర్ధనానికి ఉపయోగిస్తే శరీరంపైన లోపల కలిగే వ్యాధులు నయమవుతాయి.

ఈ నూనెను ముక్కులో 2 చుక్కల చొప్పున, నాలుకమీద 4 చుక్కల చొప్పున వేసుకున్నట్లయితే ముక్కు, గొంతు సమస్యలు తగ్గుతాయి. ఇది 10 మి.లీ. చొప్పున త్రాగితే ప్రేవులలో కలిగే అల్సర్లు, ఇతర గాయాలు మానుతాయి. మర్మావయవాలలో మర్ధనా వల్ల ఎలర్జీ, గర్భాశయ వ్యాధులు, అండాశయ వాపులు, పొట్టపైన మర్ధనా చేయడం వల్ల లోపలి భాగంలో కలిగే నొప్పులు, గాయాలు తగ్గుతాయి.

కుప్పింటాకు కీటకాల యొక్క విషాన్ని హరించడంలో కూడా ఉపయోగ పడుతుంది. జెర్రి, కందిరీగ, తేనెటీగ, తేలు లాంటి చిన్న చిన్న కీటకాలు కుట్టినపుడు అవి కుట్టిన చోట కుప్పింటాకు దంచి కట్టు కట్టినట్లయితే వాటి విషాన్ని హరించి వేస్తుంది. శరీరంలో ఎక్కడైనా వాపు వచ్చినా, గాయాలు ఇన్‌ఫెక్షన్‌కు గురయినా కుప్పింటాకు కొద్దిగా దంచి కట్టు కట్టినట్లయితే వాటిలోని చెడును తీసివేసి గాయం, వాపులను త్వరగా మాన్పే గుణం కుప్పింటాకుకు ఉంది.

కుప్పింటాకుతో వైద్యం చేసుకోవటం వల్ల ఎటువంటి ఇతర సమస్యలు ఉండవు. ఇది 'పల్లెసృజన' పాఠకులందరూ ఆచరించి, ఆరోగ్యంగా ఉండాలనేదే మా కోరిక. అందరికీ నమస్కారం.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' బాల నర్సయ్య, ఫోన్ నెం.: 6303903400

# స్పందన

**గణేశం గారికి,**

ఏప్రిల్ 7-8 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన జి-20, సివిల్-20 సదస్సుకు రావటం జరిగింది. కార్యక్రమం జరిగిన తీరు అద్భుతం. ఈ విషయంలో 'పల్లెసృజన' కృషి అపారం అని తెలియజేయుటకు సంతోషిస్తున్నాను.

**- శివశంకర్,** హైదరాబాద్.

గణేశం గారికి,

ఇటీవల జరిగిన జి-20, సివిల్-20 సదస్సు చాలా బాగా జరిగింది. ముఖ్యంగా రూరల్ ఇన్నోవేటర్స్‌తో ఒక అడ్వాంటేజ్ ఏమంటే, ఫీల్డ్ లెవెల్ రిక్వైర్‌మెంట్స్ తెలుస్తాయి. ఫ్యాక్టరీలో తయారయ్యే పరికరాలు మోనో అగ్రికల్చర్‌లాగా అన్నిటికీ ఒకేలాగా ఉంటుంది. కానీ రూరల్ ఇన్నోవేషన్స్ స్థానికంగా మనకు అవసరమైన ఉత్పత్తులను తీసుకు రావటం జరుగుతుంది. పైగా దాన్ని ఆ రైతుకు అనుగుణంగా మార్పు చేర్పులు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. వాళ్ళ సమస్యను ఎదుర్కొని దానికి పరిష్కారం తపనతో తయారు చేసింది కాబట్టి ఖచ్చితంగా చాలా బాగా ఉపయోగ పడుతుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఇన్నోవేటర్లను కలుసుకోవటం అపురూపమైన కొత్త అనుభవం. వారి ఇన్నోవేషన్‌లను ఇంకా ఎలా అభివృద్ధి చేయాలి, ఎలా సమాజంలోకి తీసుకు వెళ్ళాలి అని చెప్పిన విషయాలు కూడా చాలా బావున్నాయి. మొత్తంగా ఇదొక అద్భుతమైన అనుభవం. సదస్సుకు వచ్చిన అతిథులు చేసిన ప్రసంగాలు చాలా బావున్నాయి. ఇటువంటి సమావేశాల వల్ల ఒక మంచి వేదిక ఏర్పడినట్లయింది. ముఖ్యంగా ఈ సమావేశంలో 'వాలంటీర్ల' పని తీరు చాలా నైపుణ్యవంతంగా ఉంది. వచ్చిన అతిథులు సందేశం ఇవ్వటం వెళ్ళిపోవటం అనేది కాకుండా వారు ఏమి చెప్పారు, దాని గురించిన సమాచారం టూకీగా చెప్పటం చాలా బాగా అనిపించింది. ముఖ్యంగా యాంకరింగ్ చేసిన ఇద్దరు ఆడపిల్లలు చాలా బాగా సభను నడిపారనిపించింది. వచ్చిన అతిథుల రిజిస్ట్రేషన్, భోజన సౌకర్యాలు, వచ్చిన అతిథుల పట్ల చూపిన గౌరవ మర్యాదలు అనిర్వచనీయం. ఎంతో ఖర్చు పెట్టి చేసే యాంకర్లకు మించి కేవలం వాలంటీర్లు ఇంత సభను విజయవంతం చేశారంటే ఎవ్వరూ నమ్మలేరు. వాలంటీర్లందరూ కార్యక్రమం పట్ల ఇన్‌వాల్వ్ అయ్యి, అంత డెడికేటెడ్‌గా చేయటం చాలా బాగా అనిపించింది.

**- కందగుంట్ల శ్రీనివాస్,** షంషాబాద్, హైదరాబాద్.

ఎడిటర్ గారికి,

మీరు గత సంచికలో ప్రచురించిన పొలంలో రాళ్ళను ఏరివేసే యంత్రం పనితీరు చాలా బాగా అనిపించింది. మా పొలంలో రాళ్ళు ఏరించటానికి ప్రతి సంవత్సరం కొంత డబ్బు వెచ్చించ వలసి వస్తోంది. ఈ యంత్రం వల్ల ఒకేసారి పొలంలోని మొత్తం రాళ్ళను సునాయాసంగా తీసి గట్టున వేసుకోవచ్చు అని తెలిసి చాలా సంతోష పడ్డాము. మీరు ఇన్నోవేటర్ నంబరు కూడా ఇవ్వటంతో వారితో మాట్లాడి ఆ యంత్రాన్ని కిరాయికి తెప్పించుకుని మా పొలలో రాళ్ళు తీయిస్తున్నాము. ఒక మంచి యంత్రాన్ని పరిచయం చేసినందుకు 'పల్లెసృజన' బృందానికి, రైతుకు అవసరమైన సరైన యంత్రాన్ని తయారు చేసినందుకు దీపక్ రెడ్డి గారికి మా ధన్యవాదములు, కృతజ్ఞతలు. **- రవీందర్ రెడ్డి,** మల్లేపల్లి, నల్గొండ జిల్లా.


## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. -500094. Teelangana |
| 2. Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. Printer's Name | : | **P. Ganesham** |
| Nationality | : | Indian |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. -500094. Telangana |
| 4. Publisher's Name | : | **P. Ganesham** |
| Nationality | : | **Indian** |
| Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. -500094. Telangana |
| 5. Editor's Name | : | **J. Seshi Mohan** |
| Nationality | : | **Indian** |
| Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**